

అన్ని మండలాల్లో 40 డిగ్రీలు పైనే..

జిల్లాలో మండలాల వారీగా నమోదైన ఉష్ణోగ్రతలను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ విడుదల చేసింది. శుక్రవారం జిల్లాలో అనపర్తిలో 40.6 డిగ్రీలు, బిక్కవోలులో 41.4, చాగల్లులో 38.9 , దేవరపల్లి -2 40.4 , గోకవరం 41.3 , గోపాలపురం 41.8, కడియం 40.5 , కోరుకొండ 41.1 , కొవ్వూరు 40.0 , నల్లజర్ల 42.0, నిడదవోలు 39.3 , పెరవలి 40.6 , రాజమహేంద్రవరం 42.0, రూరల్ 40.5 , రాజానగరం 40.3, రంగంపేట 40.6 ,సీతానగరం 41.8 , తాళ్ళపూడి 38.9, ఉండ్రాజవరం 40.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జూన్ 1,2 తేదీల్లో ఈ ఉష్ణోగ్రతల్లో స్వల్పమార్పులు ఉంటాయని సంస్థ తెలిపింది.



పండుటాకులపై పగ



పింఛనుకు ఈ నెలా తప్పని తిప్పలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మండుటెండలోనూ పండుటాకులపై పగ సాధిస్తున్నాడు జగన్. ఉష్ణోగ్రతలు 40 దాటి జిల్లా సలసలా మరుగుతోంది. రాత్రి 9 గంటలు దాటినా గుబులు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.అయినా పింఛన్లు ఈ నెల కూడా బ్యాంకుల ద్వారానే ఇవ్వాలని నిర్ణయించింది.మే నెలలో ఇలాగే చేసి పండు టాకుల ప్రాణాలను ఎండకు బలి చేసింది. అయినా పింఛను లబ్ధిదారులపై దయ కలగడం లేదు.ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న విడుదలైంది. ఆ నెల పింఛను ఏప్రిల్‌లో సచివాలయ సిబ్బంది ద్వారా సునాయాసంగా పంపిణీ చేశారు. వలంటీర్లు లేకపోతే ఏదో జరిగిపోతోందనేది అనవసర భ్రమ మాత్రమేనని తేలిపోయింది.టీడీపీపై వేద్దామనుకున్న బురద తిరిగొచ్చి వైసీపీ పాలకులపై పడింది. దీంతో పన్నాగానికి మరింత పదును పెట్టారు. పర్యవసానంగా వృద్ధులు, మహిళలు పింఛను కోసం ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోంది. పైగా జనవరి నుంచి చూస్తే జూన్ 1కి వచ్చే సరికి జిల్లాలో సుమారు 6వేల పింఛన్లు 'గాలి'లో కలిసి పోవడం గమనార్హం.

మళ్లీ అదే పాపం

ఎన్నికల సంఘం వలంటీర్లను సంక్షేమ పథకాల పంపిణీ నుంచి పక్కన పెట్టింది. దీంతో వాళ్లు లేకపోతే పింఛన్ల పంపిణీ కష్టమవుతుందంటూ ఓ భ్రమతో కూడిన భయాన్ని జనాల్లోకి తీసుకెళ్లాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించింది.కానీ మార్చి నెల పింఛన్‌ని ఏప్రిల్‌లో సచివాలయ సిబ్బంది ఎక్కడా ఇబ్బంది లేకుండా అందజేశారు. దీంతో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డ వైసీపీ ప్రభుత్వం డీబీటీ విధానంలో బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తామంటూ లబ్ధిదారుల ప్రాణాలతో చెలగాటం ఆడే కుట్ర చేసింది. ఏప్రిల్ నెల పింఛన్‌ని బ్యాంకుల్లో జమ చేసింది. అయితే పింఛనుదారుల ఖాతాలు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు.జిల్లాలోని సుమారు 2 వేల మంది ఖాతాల్లో డబ్బు జమ కాలేదు. దీంతో మళ్లీ వారికి నేరుగా అందజేయాల్సి వచ్చింది. బ్యాంకుల దగ్గర లబ్ధిదారులు గంటల కొద్దీ ఎండలో వేచి చూడాల్సి వచ్చింది. బ్యాంకులకు రావడం, ఖాతాల్లో పడిన డబ్బులను డ్రా చేసుకొని ఇంటికి వెళ్లడం ప్రహసనంగా మారింది. ఎండ వేడిమిని తట్టుకోలేక వృద్ధులు ప్రాణాలు కోల్పోయారు. ఆ పాపాన్ని టీడీపీపైకి నెట్టేయాలని చూసిన జగన్.. ఏప్రిల్ నెల మాదిరిగా సచివాలయ సిబ్బందితో ఎందుకు పింఛన్లు పంపిణీ చేయలేదనే ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయారు. మళ్లీ అదే పాపాన్ని జూన్ నెలలోనూ చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా పింఛన్లు పంపిణీ చేయడానికి సిద్ధమయ్యారు. ఈ విధానం బ్యాంకులకు కూడా తలనొప్పిగా మారింది. పింఛను లబ్ధిదారులు బ్యాంకులకు పోటెత్తడం, చాలా మంది ఖాతాల్లోని సమస్యలను సరిచేయడం వంటివి సిబ్బందిని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయి. సచివాలయాలు ఉండగా బ్యాంకుల్లో డబ్బు జమ చేయడం ఎందుకని బ్యాంకు సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. రాజకీయ ఎత్తుగడలతో ఇటు బ్యాంకు సిబ్బందిని, అటు లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది ఉన్నా..

జిల్లాలోని 300 పంచాయతీలు, 3 నగరపాలికల పరిధిలో 512 సచివాలయాలు ఉండగా వాటిలో సుమారు 4 వేల మంది సిబ్బంది ఉన్నారు. ఈ నెల మొత్తం 2,42,300 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. వీటిలో 71,232 మందికి ఇంటికి వెళ్లి అందజేస్తారు. 1,71,068 మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే, వీళ్లకు కూడా 4వేల మంది సచివాలయ సిబ్బందిలో 3వేల మందిని పింఛన్లకు వినియోగించినా.. రోజుకు 6గంటలు గంటకు 10 మంది చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తే ఒక్క రోజులో అందరి చేతిలోనూ పింఛను డబ్బులు పెట్టవచ్చు. అప్పుడు ప్రభుత్వం జిల్లాకు సంబంధించి మొత్తం రూ.71,92,17,000 ఒకేసారి బ్యాంకు ఖాతాలకు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం కొద్ది కొద్దిగా జమ చేస్తుండడంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది.

భానుడి దెబ్బకు.. విలవిల..



భానుడి బంద్ : నిడదవోలులో నిర్మానుష్యంగా గణేష్‌చౌక్

రోజురోజుకు మండుతున్న ఎండలు

- 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదు
- ఉదయం 8 గంటల నుంచే ఎండ
- రాత్రి 9 గంటలైనా తగ్గని ఉక్కపోత
- కరెంట్ కోతలతో బెంబేలు
- తట్టుకోలేక రోడ్డెక్కుతున్న జనం
- మరో రెండు రోజులు ఇంతే

రాజమహేంద్రవరం సిటీ, మే 31 : భానుడు పగ పట్టాడు.. భగ భగమండిపడుతున్నాడు.. తట్టుకో లేనంతగా ప్రతాపం చూపుతున్నాడు. జనం ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత ఆదివారం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది.. సుమారు ఐదు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో తారస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. ఉదయం 8 గంటలకు భానుడు వచ్చి ఒక్కసారిగా వేడి మంటలు పుట్టిస్తున్నాడు. రాత్రి సమయాల్లోనూ ఉక్కబోత తట్టుకోలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాత్రి 9 గంటలు దాటినా వాతావరణంలో ఏమాత్రం మార్పు రావడంలేదు. ఒక పక్క ఉక్కబోత.. మరో పక్క కరెంట్ కోతలతో జనం అల్లాడిపోతున్నారు.ఏప్రిల్ నెలలో 45 డిగ్రీల వరకూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటుపై క్రమంగా తగ్గి వాతావరణం పూర్తిగా చల్లబడింది. తుఫాన్ ప్రభావం కారణంగా మే నెల ఆరంభం నుంచి 35 నుంచి 40 డిగ్రీల మధ్య ఎండలు కాశాయి. మే నెలాఖరులో భానుడు ఉగ్రరూపం చూపాడు. జిల్లా ఎటు చూసినా గతంలో భారీ వృక్షాలు, పచ్చదనంతో నిండి ప్రశాంతంగా ఉండేది. దీంతో వాతావరణం చల్లగా ఉండేది. అయితే ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. కొన్ని చెట్లు అభివృద్ధి పనుల పేరుతో తొలగిస్తే మరికొన్ని సీఎం జగన్ పర్యటనల పేరుతో తొలగించారు. ఎండ వేడిమి గ్రహించి చల్లదనాన్ని ఇచ్చే చెట్లులేకపోవడం,మరొక పక్క రాజమహేంద్రవరం ,కొవ్వూరు వంటి నగరం, పట్టణాలలో సీసీ రోడ్లు వేసి ఉన్న చెట్లను తొలగించడం వల్ల 40 డిగ్రీల ఉష్ణోగ్రతనే తట్టుకునే పరిస్థితి కనిపించడం లేదు.ఈ నెల 29న గరిష్ఠం 42.0 కనిష్ఠం 30.0, 30వ తేదీన గరిష్ఠం 43.0 కనిష్ఠం 29.0 ,31న గరిష్ఠం 42.0 కనిష్ఠం 29.0 గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఈ ఎండలు సుమారు 45 డిగ్రీల ఉష్ణోగ్రతల స్థాయిని తలపించాయి. దీంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

జిల్లాలో సాధారణ రోజులతో పోల్చితే విద్యుత్ వినియోగం చాలా పెరిగింది. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఇళ్ళలో కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు వినియోగం పెంచేశారు. జిల్లాలో రాజమహేంద్రవరం సర్కిల్‌లో గత నెల 30 నాటికి విద్యుత్ సర్వీసులు19,86,842 ఉన్నాయి. విద్యుత్ సాధారణ డిమాండ్ 1139 ఎండబ్ల్యూ కాగా శుక్రవారం సాధారణ వినియోగం 22.691గా ఉంది. ఈ లెక్కన విద్యుత్ వినియోగం రెండింతలు పెరిగింది.ఈ నేపథ్యంలో ఎక్కడిక్కడ ఓవర్ లోడ్ పడి ఫీజులు కొట్టేయడం, టాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్యలు ఉత్పన్నమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే మరమ్మతులు చేస్తున్నారు.

రోజుకు 20 డీహైడ్రేషన్ కేసులు

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యధిక ఉష్ణోగ్రత బారిన పడిన వారు రోజుకు 20 మంది వైద్యం చేయించుకుని వెళుతున్నారని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. గత నెల రోజుల నుంచి ఈ సంఖ్య పెరుగుతూ వస్తుందని తెలిపారు. వివిధ పనులపై బయటకు వచ్చిన ప్రజలు ఎండ తీవ్రతకు గురై డీహైడ్రేషన్ చెంది ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకుని సాయంత్రానికి వెళ్లిపోతున్నారని చెప్పారు.ఒక్క జిల్లా ఆసుపత్రిలోనే రోజుకు సగటున 20 మంది చికిత్స చేయించుకుంటే ఇక ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ఇంతకు రెట్టింపు కేసులు వస్తున్నట్టు తెలిసింది.

ఎండలో తిరగవద్దు..



రాజానగరం : ప్రస్తుత వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేందుకు మంచి నీరు, కొబ్బరి నీరు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి. తప్పని సరి పరిస్థితుల్లో తప్ప ఎట్టిపరిస్థితుల్లోనూ ఎండలో తిరగరాదు. తప్పని సరి పరిస్థితుల్లో బయటకు వస్తే తగిన రక్షణ చర్యలు చేపట్టాలి. ఎండలో లేకపోయినప్పటికి జ్వరంగా గానీ, నీరసంగా గానీ, చెమటలు అధికంగా పడితే సమీపం లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకుని ఒక లీటర్ నీటిలో ఒక ప్యాకెట్ కలుపుకుని తాగాలి. ఎవరికైనా నీరసంగా ఉంటే ఓఆర్ఎస్ ద్రావణం వాడాలి. రోడ్లపై లభించే జంక్ ఫుడ్ తినడం మానేయాలి. ఏవిధమైన అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ బెనడిక్ట్, వైద్యాధికారి, పాలచర్ల పీహెచ్‌సీ



విద్యుత్ పునరుద్ధరించాలని ధర్నా

సీతానగరం,మే 31 : విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. రఘుదేవపురం గ్రామంలో గత మూడు రోజులుగా విద్యుత్ సర ఫరా సక్రమంగా ఉండడంలేదు. అంతేకాకుండా గురువా రం రాత్రి 2 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.దీంతో ప్రజలు ఆగ్రహానికి లోనయ్యారు. స్థానిక పంచాయతీ వీధి సమీపంలోని ప్రజలు సాయంత్రం 4 గంటలకు పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డుకు అడ్డంగా బైఠాయించి ధర్నా చేశారు. దీంతో సీతానగరం, రాజమహేంద్రవరం రోడ్డులో రాకపోకలకు తీవ్ర అంతరా యం ఏర్పడింది. స్థానికులు సవల మణికంఠ, సవల మోహన్, గారపాటి వినయ్, యు.రాజేష్ తదితరులు మాట్లాడుతూ గత రాత్రి 8 గంటల నుంచి ఇప్పటి వరకు విద్యుత్ లేదని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా కనీసం స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండలకు తోడు విద్యుత్ లేకపోవడంతో అధికారులు స్పందించకపోవడంతో గత్యంతరం లేక ధర్నా చేపట్టామ న్నారు.వెంటనే విద్యుత్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఏఈ చంద్రమోహన్ అక్కడకు చేరుకున్నారు.విద్యుత్ పునరుద్ధరించడంతో ధర్నా విరమింపజేశారు. ఏఈ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ మరమత్తు కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడిందని దానిని సరిచేసి విద్యుత్ ఇచ్చామన్నారు..

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నాం

వేసవిలో సాధారణంగానే విద్యుత్ వినియోగం పెరుగుతుంది. అధిక ఉష్ణోగ్రతలకు ప్రజలు ఏసీలు, ఫ్యాన్లు , ఎయిర్ కూలర్లు ఎక్కువగా వినియోగిస్తారు. దీని వల్ల ఓవర్ లోడ్ పడుతుంది. వేసవిలో వినియోగానికి తగినట్టుగా గతనెల 30వ తేదీ వరకు పనులు చేశాం. ఒక్కసారిగా వినియోగం పెరిగినా దానికి తగ్గట్టుగా సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నాం. **- టీవీఎస్ఎన్.మూర్తి, ఎస్ఈ ఏపీఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం**



లో వోల్టేజ్ సమస్య తీర్చాలని సబ్ స్టేషన్ ముట్టడి..

అనపర్తి, మే 31 : అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వీదిలో గురువారం రాత్రి విద్యుత్ లోవోల్టేజి రావడంతో అనేక విద్యుత్ ఉప కరణాలు దగ్ధమయ్యాయి. దీంతో వినియోగదారులు అనపర్తి మండలం దుప్పలపూడి సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. వినియోగదారులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గురువారం రాత్రిలో వోల్టేజీ రావడంతో ఏసీలు, ఫ్రిజ్‌లు, వంటి అనేక గృహోపకరణాలు దగ్ధమయ్యాయని వాపోయారు. రాత్రి ఇంత జరిగినా కనీసం గ్రామంలోని లైన్‌మెన్ కూడా రాలేదని ఎన్నిసార్లు ఫోన్‌లు చేసినా స్పందించలేదని వినియోగదారులు వాపోయారు. సర్పంచ్ కర్రి బులిమోహ నరెడ్డి, మాజీ సర్పంచ్ కర్రి వెంకటరామారెడ్డి గ్రామంలోని విద్యుత్ సమస్యలను ఏఈ వీరభద్రరావుకు వివరించారు. ట్రాన్స్‌పార్మర్ వీధిలో గతంలో 100కేవీ ట్రాన్స్ ఫార్మర్ ఉండేదని దానిని తొలగించి డబ్బా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో సమస్య తలెత్తిందన్నారు. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఏఈ హామీ ఇవ్వడంతో వినియోగదారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఆధునికీకరణ.. గాలికే!



శెట్టిపేట స్లూయిజ్

- ఐదేళ్లుగా ఆధునికీకరణ హుష్‌కాకి
- కాలువలను గాలికొదిలేసిన వైనం
- పనులూ లేవు.. ప్రతిపాదనలు లేవు
- మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థ
- శివారుప్రాంతాలకు అందని నీరు
- లబోదిబోమంటున్నరైతాంగం

నిడదవోలు, మే 31 : గోదావరి డెల్టాకు ఆధునికీకరణే ప్రాణం. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని శివారు ప్రాంత భూముల రైతాంగానికి ఆధునికీకరణ గొప్పవరం. డెల్టా ఆధునికీకరణపై రైతాంగం ఆశలను ప్రతి ఏటా వైసీపీ ప్రభుత్వం ఏదో ఒక కారణంతో నట్టేట ముంచేస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో గత ఐదేళ్ల వివిధ కారణాలతో ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. సొమ్ములు ఉన్నా పని పూర్తి కాని పరిస్థితి.ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది ఆధునికీకరణ పనులకు సంబంధించి ఎటువంటి ప్రక్రియ సాగలేదు.అసలు యాక్షన్ క్లోజర్ ప్లాన్ లేకుండా పోయింది. ప్రతిపాదనలు లేవు పనులు లేకుండానే శనివారం ఉదయం 11 గంటలకు నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద పశ్చిమ డెల్టా కాలువలకు నీటి పారుదల శాఖాధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి డెల్టాలైన తూర్పు, సెంట్రల్, పశ్చిమ డెల్టాల పరిధిలోని ఆధునికీకరణ అవసరంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

2007 నుంచి ఆధునికీకరణ...

గోదావరి డెల్టా ఆధునికీకరణకు 2007 నవంబరు నెలలో సమావేశం నిర్వహించి శ్రీకారం చుట్టారు. గోదావరి జిల్లాల్లో డెల్టా సిస్టంను 24 ప్యాకేజీల కింద విభజించి ఐదు వేల కోట్లతో 2008వ సంవత్సరంలో 258 జీవోను ప్రభుత్వం విడుదల చేసింది.ఆధునికీకరణ జరిగితే డెల్టాల పరిధిలో తూర్పు,సెంట్రల్, పశ్చిమ డెల్టాలలో ఖరీఫ్‌లో సుమారు 10 లక్షల పైగా ఎకరాలకు, రబీలో సుమారు 9 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో నీరందనుంది.

నేటికీ 20 శాతమే పనులు..

తాతల నాటి కాలంలో సుమారు 140 ఏళ్ల కిందట గోదావరి కాలువలు ఏర్పడ్డాయి. గోదావరి పరీ వాహక ప్రాంతంలో ఉన్న కాలువల స్లూయిజ్‌లు, లాకు లు, రెగ్యులేటర్లు,నదులకు పక్కన కట్టిన గోడలు శిథిలావస్థకు చేరడంతో గోదావరి శివారు ప్రాంతాల్లో నీరందక రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. దీని కోసం గోదావరి డెల్టాకు ఆధునికీకరణ ఎంతో అవసరం అయింది. గోదావరి డెల్టా పరిధిలోని శిథిలావస్థకు చేరుకున్న కట్టడాలు,లాకులు, రెగ్యులేటర్లు,స్లూయిజ్‌ల నిర్మాణాలతో పాటు ఇతర పనులు చేయవలసి ఉంది. ఇప్పటి వరకు 20 శాతం మాత్రమే పనులు జరగ్గా ఏ ఏడాదికాఏడాది క్షేత్రస్థాయిలో పనులు ఆలస్యం కావడం అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాలతో సమయం సరిపోక ఆధునికీకరణ పనులు మందగించాయి.ఆధునికీకరణ పూర్తయితే మరో వందేళ్ల పాటు డెల్టాలో రైతాంగం వెనక్కి చూసుకునే పరిస్థితే ఉండదు.

ఆధునికీకరణకు జాప్యమిదే..

ఆధునికీకరణలో చేపట్టవలసిన పనులకు ఆఖరి నిమిషంలో ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం టెండర్లను ఖరారుచేయడం క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించే నాటికి కాలువల్లో తడి ఆరకపోవడం వంటి కారణాలతో పాటుగా ఈ పనులు నిర్వహించడానికి కాంట్రాక్ట్ ఏజెన్సీలు సకాలంలో ముందుకు రాకపోవడం కూడా ఒక కారణం.నవంబరు నుంచి జూన్ వరకు రెండో పంటకు కాలువల ద్వారా నీరివ్వకుండా ఉంటే పనులు వేగవంతం అవుతాయి అనేది కాంట్రాక్ట్ ఏజెన్సీల వాదన. రెండో పంటకు కూడా నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయాలనేది రైతాంగం డిమాండ్. దీనికి రాజకీయ ఒత్తిళ్ళు తోడవడం వంటి కారణాలను కాంట్రాక్ట్ ఏజెన్సీలు ఎత్తి చూపుతున్నాయి.రెండో పంటకు నీటిని ఆపితే పూర్తి స్థాయిలో ఆధునికీకరణ పనులను చేయవచ్చనేది కాం ట్రాక్ట్ ఏజెన్సీల వాదన.

శెట్టిపేట ఆధునికీకరణింతేనా?

ఆధునికీకరణ పనులు మరమ్మతుల నిర్వహణ పనులు చేపట్టకపో వడంతో నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి నిడదవోలు మండలం శెట్టిపేట వైర్ వద్ద ఉన్న గేట్ల నుంచి యథేచ్ఛగా గోదావరి జలాలు వృథాగా పోతు న్నా నీటిపారుదల శాఖాధికారులు అటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు.పశ్చిమ డెల్టా హెడ్ స్లూయిజ్ పరిధిలో ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లాలో 5.30 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. అలాంటి హెడ్ స్లూయిజ్ సైతం ఈ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైం ది.శివారు ప్రాంత రైతాంగానికి ఈ ఏడా ది సాగునీరు సరఫరాలో సమస్యలు తప్పేటట్లు లేవు.

నేడు కాలువలకు నీరు విడుదల

ఈ ఏడాది మే 10వ తేదీన గోదావరి డెల్టా పరిధిలోని తూర్పు మధ్యమ పశ్చిమ డెల్టాలకు సాగునీటి విడుదలను నిలిపివేశారు. సుమారు 22 రోజుల తరువాత అనగా జూన్ 1వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు గోదావరి డెల్టాలకు నీటిని విడుదల చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆధునికీకరణ ఊసే లేకపోయినా మరమ్మతుల నిర్వహణ పనులకు సంబంధించి పశ్చిమ డెల్టా పరిధిలో 164 పనులకు రూ.17 కోట్ల పను లకు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి అను మతులు రాక ఆధునికీకరణ పనులతో పాటు మరమ్మ తుల నిర్వహణ పనులు ఈ ఏడాది హుష్ కాకే.

డెల్టాల పరిధిలో ఆయకట్టు వివరాలు

డెల్టాలు	ఖరీఫ్	రబీ
తూర్పు డెల్టా	2,81,303	2,64,533
సెంట్రల్ డెల్టా	2,01,896	1,72,000
పశ్చిమ డెల్టా	5,29,965	4,69,000
మొత్తం	10,13,161	8,96,533



77,817 ఎకరాల్లో ఖరీఫ్

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, మే 31: జిల్లా వ్యాప్తంగా 77.817 హెక్టార్లలో ఈ ఖరీఫ్ సాగులో వరి పండించినట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు. తొర్రేడులో శుక్రవారం వరి నారుమళ్ళను ఆయన పరిశీలించారు. ఖరీఫ్ పంటల కోసం భూసారాన్ని పెంపొందించేందుకు పశువుల ఎరువుకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్టు డీఏవో తెలిపారు. ఈ ఖరీఫ్‌లో 58,356 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా జిల్లాలో ఇప్పటికి 23,096 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్లు వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు రసీదు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఏ భీమరాజు, వీఏవో ఎన్‌డి శ్రీనివాస్, విశాలాక్షి, రమాదేవి, రైతులు దండమూడి రవికుమార్ పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపునకు రూమ్ మ్యాప్ సిద్ధం

8



నన్నయ వర్శిటీలో లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఇక మూడు రోజులే

- 4న కౌంటింగ్‌కు ఏర్పాట్లు సిద్ధం
- నేడు ఎగ్జిట్‌పోల్ ఫలితాలు
- సర్వత్రా ఉత్కంఠ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇక మూడురోజులే ఉంది.ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రకటించడానికి అవసరమైన ఏర్పాట్లన్నీ చకచకా నడుస్తున్నాయి. 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు ఆరంభమవుతుంది. మంగళవారం ఉదయం 4.30 గంటల నుంచే సంబంధిత ఓట్ల లెక్కింపు అధికారులు అక్కడకు చేరుకుంటారు. జిల్లాలో మొదటి ఫలితం కొవ్వూ రు అసెంబ్లీ నియోజకవర్గానిదే అవుతుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ఫలితం చివరిలో వస్తోంది.ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఇప్పటికే ఓటర్ల నాడి, సర్వేలు చెబుతున్నాయి.అయినా టెన్షన్ వెంటాడుతోంది. ఇప్పటికే అభ్యర్థులంతా సర్వేలు చేయించుకున్నారు. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా ఎగ్జిట్‌పోల్ సర్వే ఫలితాలతో కాస్త ఊరట పొందడం అలవాటైపోయింది. దీనికి కారణం కొన్ని ఎగ్జిట్‌పోల్ సర్వేలు నిజం కావడం. కౌంటింగ్ రోజు కంటే ముందుగానే ఒక విధంగా ఫలితాలు ఎలా ఉంటాయనేది, ఎవరు అధికారంలోకి వస్తారనే విషయాలను ఈ ఎగ్జిట్‌పోల్ సర్వేలు స్పష్టం చేస్తుంటాయి. గతంలో పోలింగ్ జరిగిన వెంటనే ఈఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాలు ప్రకటించేవారు.కానీ సార్వత్రిక ఎన్నికలు దేశవ్యాప్తంగా జరుగుతుండడంతో అన్ని ప్రాంతాల్లో ఎన్నికలు పూర్తయ్యేవరకూ ఎగ్జిట్‌పోల్ ఫలితాలు ప్రకటించకూడదనే ఆంక్షలను ఎన్నికల కమిషన్ విధించింది.దీంతో అన్ని ప్రాంతాల్లో ఎన్నికలు ముగిసిన తర్వాతే వీటిని ప్రకటిస్తారు. దేశంలో మొత్తం ఏడు విడతలుగా ఎన్నికలను ప్రకటించారు.ఇప్పటికే ఆరు విడతల ఎన్నికలు జరిగిపోయాయి. శనివారం ఏడో విడత అంటే చివరి విడత పోలింగ్ జరగనుంది.ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరగనుంది.ఈ పోలింగ్ ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్ ఫలితాలు దేశవ్యాప్తంగా విడుదల చేస్తారు. శనివారం సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్ ఫలితాలు విడుదల చేస్తారు. దీంతో చాలా వరకూ టెన్షన్ తగ్గినట్టు అవుతుంది. గెలిచేవారిలో ఆనందం పెరిగిపోతుంది. ఓటమి చెందేవారిలో వణుకు మొదలవుతుంది. చివరి ఫలితం 4న వెలువడుతోంది.

అటవీ అధికారుల దోపిడీ



గుడిసె విహార కేంద్రం

- గుడిసె ఏకో టూరిజం ప్రాజెక్టు నిధుల్లో చేతివాటం
- కమిటీ లేకుండానే సీబీఈటీ కార్యకలాపాలు
- ఆకుమామిడికోటలో అనధికార చెక్‌పోస్టు

రమ్యమైన దుఃఖాన్ని సైతం మరిపించేది ప్రకృతి! ఈ ప్రకృతినే విహారం పేరుతో ఎరగా వేసి అటవీ అధికారులు పర్యాటకులను ఆకర్షించి, తద్వారా వచ్చే ఆదాయాన్ని తమ చేతివాటంతో దోచేయడం రంపచోడవరం అటవీ డివిజన్లో ప్రహసనంగా సాగుతోంది. రంపచోడవరం డివిజన్లోని పలు రేంజిల పరిధిలో పర్యాటకం కోసం పలు కమ్యూనిటీ బేస్డ్ ఏకో టూరిజం(సి.బి.ఇ.టి) ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అందులో కీలకంగా మారేడుమిల్లి రేంజ పరిధిలోని గుడిసె, మారేడుమిల్లి, వాలమూరు గొంది సీబీఈటీల ద్వారానే పర్యాటకుల నుంచి ఆదాయం సమకూరుతోంది. ఇందులో గుడిసె సీబీఈటీకి పర్యాటకుల తాకిడితో పాటు ఆదాయమూ ఎక్కువే! ఈ సీబీఈటీ కార్యకలాపాల నిర్వహణలో సంబంధిత అటవీ అధికారుల తీరుపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

(రంపచోడవరం/మారేడుమిల్లి)

ముఖ్యంగా గుడిసె ఏకో టూరిజం ప్రాజెక్టు నిర్వహణ చుట్టూనే అనేక ఆరోపణలు తిరుగుతున్నాయి. సీబీఈటీలకు గిరిజనులే సభ్యులుగా కమిటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారానే వాటి నిర్వహణ సాగించడం నిబంధన. ఈ ప్రకారం గుడిసె సీబీఈటీకి కమిటీని నియమించడం, కమిటీ ఛైర్మన్‌తో కలిపి ఇద్దరికీ జాయింట్ ఖాతాను మారేడుమిల్లిలోని యూనియన్ బ్యాంకులో ఖాతాను కూడా తెరిచారు. గుడిసె సీబీఈటీకి ఉన్న కమిటీని అక్టోబరు 2023లో అటవీ అధికార్లు రద్దు చేశారు. నేటికీ కొత్త కమిటీని నియమించకుండానే అధికారులే సీబీఈటీ కార్యకలాపాలను నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. గుడిసె విహారానికి వచ్చే పర్యాటకుల నుంచి అధికారికంగా కొంత అనధికారికంగా కొంత సొమ్ములను వసూలు చేస్తున్నారు. అధికారికంగా వసూలుచేసిన సొమ్ములను బ్యాంకు ఖాతాల్లో వేయడం, ఆనక ఆ ఖాతా నుంచి సొమ్ములను డ్రా చేయడం సాగింది. ఈ విధంగా లక్షలాది రూపాయలను గత ఏడు నెలలుగా డ్రా చేశారని సమాచారం. కమిటీ లేకుండా బ్యాంకు ఖాతా నుంచి సొమ్ములను ఎలా డ్రా చేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఆకుమామిడికోటలో చెక్‌పోస్టు

ఇక గుడిసె విహారయాత్రికులను క్రమబద్ధీకరించి రుసుము వసూలు చేసేందుకు సమీపంలోనే చెక్‌పోస్టును నిర్వహించేవారు. గతంలో రాజమండ్రి అటవీశాఖ సీసీఎఫ్ ఇక్కడకు పర్యటనకు వచ్చిన సమయంలో ఈ చెక్‌పోస్టును ఎత్తేయాలని ఇక్కడి అటవీ అధికారులకు సూచన చేశారు. ఆ మేరకు చెక్‌పోస్టును ఎత్తేశారు కూడా! తదనంతర కాలంలో గుడిసెకు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆకుమామిడికోటలో చెక్‌పోస్టును ఏర్పాటుచేసి గుడిసెకు వచ్చే విహారయాత్రికుల నుంచి రుసుములు వసూలు చేస్తున్నారు. కానీ ఆకుమామిడికోటలో ఈ చెక్‌పోస్టు ఏర్పాటుకు సీసీఎఫ్ నుంచి ఎటువంటి అనుమతులూ లేవని సమాచారం. ఇదే నిజమైతే ఈ చెక్‌పోస్టు ద్వారా గుడిసె పర్యాటకుల నుంచి అనధికారికంగానే రుసుములు వసూలు చేస్తున్నట్టే! ఇదిలావుండగా ఈ ప్రాంతమంతా గిరిజన ప్రాంతం కావడం, అటవీ హక్కుల చట్టం పరిధిలోనిది కావడంతో గిరిజనులకు ఉన్న సామాజిక హక్కుల నేపథ్యంలో అటవీశాఖ అధికారులు సాగిస్తున్న ఈ కార్యకలాపాలకు సంబంధించి వుల్లంగి పంచాయతీలో పీసా గ్రామసభ అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.


ఆకుమామిడికోటలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు

రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌కి 10 అవార్డులు

రాజమహేంద్రవరం, మే 31(ఆంధ్రజ్యోతి): 2023-24 ఆర్థిక సంవత్సరంలో వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన రాజమండ్రి తపాలా డివిజన్‌కి 10 అవార్డులు దక్కాయని సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులు అందుకోవడం జరిగిందన్నారు.

జీఎస్‌ఎల్‌లో నెలరోజులు ఉచిత వైద్య సేవలు

రాజానగరం, మే 31: నేటి నుంచి జీఎస్‌ఎల్ జనరల్ ఆసుపత్రిలో నెల రోజులపాటు(జూన్1 నుంచి జూలై 1)వ తేదీ వరకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు జీఎస్‌ఎల్ వైద్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల ప్రారంభించి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా కృతజ్ఞతా పూర్వకంగా నెల రోజులపాటు అన్నిరకాల టీ వైద్యసేవలు, మెడికల్ ప్రొసీజర్లు, సర్జరీలు ఉచితంగా చేస్తామని, నెలరోజులు మెడికల్ టెస్టులు, ఇన్వెస్టిగేషన్ల ఫీజుల్లో 50శాతం తగ్గిస్తామన్నారు. మందులు మాత్రం పేషెంట్లే కొనుగోలు చేసుకోవాలన్నారు. తమ సంస్థలైన రాజానగరం జీఎస్‌ఎల్ జనరల్ ఆసుపత్రి, రాజమహేంద్ర వరంలోని స్వతంత్ర ఆసుపత్రి, కేన్సర్ ఆసుపత్రిలో ఉచిత వైద్యం, డిస్కౌంట్‌పై వైద్య సేవలు అందజేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ పరిధి లో ఉన్నవారికి యథావిధిగా ఉచిత వైద్యం అందుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకో వచ్చని డాక్టర్ గన్ని భాస్కరరావు పేర్కొన్నారు.

సినీ దర్శకుడు బుచ్చిబాబు తండ్రి అంత్యక్రియలు

కొత్తపల్లి, మే 31: ప్రముఖ చలన చిత్రదర్శకుడు సానా బుచ్చిబాబు తండ్రి వెంకట్రావు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. శుక్రవారం ఆయన భౌతికకాయాన్ని కాకినాడజిల్లా కొత్తపల్లి మండలానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. విషయాన్ని తెలుసుకొన్న సినీ డైరెక్టర్, బుచ్చిబాబు గురువు సుకుమార్ కొత్తపల్లి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పితృ వియోగంతో బాధడుతున్న బుచ్చిబాబును డైరెక్టర్ సుకుమార్ ఓదార్చారు.


కొత్తపల్లిలో బుచ్చిబాబు తండ్రి అంత్యక్రియల్లో దర్శకుడు సుకుమార్



ఛత్తీస్‌గడ్ - ఏపీ రాష్ట్రాల సరిహద్దున ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కమిటీ

ఐదు మాసాల్లో 120 మంది ఆదివాసీల హత్య

- నిజ నిర్ధారణ కమిటీని అడ్డుకున్న పోలీసు బలగాలు
- బెదిరింపులు, బుజ్జగింపులు
- రాజ్యం పోలీసుల నిర్బంధఖాండను ఖండిద్దాం
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక స్టీరింగ్ కమిటీ ఆరోపణ

చింతూరు, మే 31 : ఛత్తీస్‌గడ్‌లో గత ఐదు మాసాలుగా మారణ ఖాండ జరుగుతోందని ఈ క్రమంలో మావోయిస్టుల ముద్రవేసి 120 మంది ఆదివాసీలను పోలీసు బలగాలు హత్య చేశాయని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆరోపించింది. ఈ మేరకు కమిటీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నేతృత్వంలో 60 మందితో కూడిన నిజనిర్ధారణ కమిటీ గురువారం తెలంగాణ మీదుగా ఛత్తీస్‌గడ్ చేరుకొని అక్కడి బాధిత కుటుంబాలను కలిసే ప్రయత్నం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ నారాయణరావు, మాదన కుమార స్వామి, జాబిలి (తెలంగాణ) నాయకత్వంలో బయలుదేరిన బృందాన్ని తెర్లగూడ వద్ద పోలీసు బలగాలు అడ్డుకున్నారన్నారు. భద్రతా కారణాలను సాకుగా చూపి వెనుతిరిగి వెళ్లాల్సిందిగా హెచ్చరించినట్లు ఆ ప్రకటనలో ఆరోపించారు. తామంతా ప్రయాణంతో అలసిపోయామని బీజాపూర్ చేరుకొని అక్కడ విశ్రాంతి తీసుకుంటామని ఎంతగా నచ్చచెప్పినా తమ మాటను పెడచెవిన పెట్టిన బలగాలు బెదిరింపులకు దిగాయని ఆరోపించారు. చివరకు కమిటీని భద్రాచలం తిప్పి పంపారన్నారు. దీంతో శుక్రవారం వయా చింతూరు మీదుగా దంతెవాడ చేరుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని కుంట సరిహద్దున బలగాలు అడ్డుకోవడంతో పాటు తమను పారా మిలటరి బలగాలు చుట్టుముట్టాయన్నారు. దీంతో తాము రోడ్డుపైనే బైఠాయించామని తెలిపారు. బలగాలు బుజ్జగించడం మొదలుపెట్టాయ న్నారు. ఛత్తీస్‌గడ్‌లో తరచూ కాల్పులు జరుగుతున్నాయని అక్కడకు వెళ్లడం సరికాదంటూ బలగాలు చెప్పాయన్నారు. చివరకు అక్కడి నుంచి కూడా తమను వెనక్కు తిరిగి పంపారన్నారు. ఛత్తీస్‌గడ్‌లో జరుగుతున్న మారణఖాండను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, హక్కులను బలగా లు ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని కమిటీ తీవ్రంగా ఖండించింది. తమను ఛత్తీస్‌గడ్‌లోకి అనుమతించాల్సిందిగా వారు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మత్స్యకారుల మృతి

- బొలెరో వ్యాన్‌ను ఢీకొట్టిన బియ్యం లోడు ట్రాక్టర్
- మరో ముగ్గురికి గాయాలు
- చేపలవేటకు బయలుదేరిన పది నిమిషాలకే ప్రమాదం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సూరిబాబు, సాయిబాబు


గుమ్మిలేరు వద్ద వ్యాన్, ట్రాక్టర్ ఢీకొట్టుకున్న దృశ్యం

ఆలమూరు, మే 31: చెరువులో చేపల వేటకు బయలదేరిన పది నిమిషాలకే వారు వెళుతున్న బొలెరా వ్యాన్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ శుక్రవారం తెల్లవారుజామున ఢీకొట్టడంతో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరువద్ద జరిగిన ఈరోడ్డు ప్రమాదంలో ఆలమూరు గ్రామానికి చెందిన లంకే సూరిబాబు(49), వనమాడి సాయిబాబు (59), కొప్పాడి రమణ, డొక్కాడి శ్రీనివాస్, వనమాడి మావుళ్లస్వామి బొలెరా వ్యాన్‌లో రాజానగరం మండలం తుంగపాడు గ్రామంలోని చెరువులో చేపలవేటకు తెల్లవారుజామున బయలుదేరారు. ఆలమూరు నుంచి బయలుదేరిన పది నిమిషాలలో గుమ్మిలేరు సమీపంలో మండపేట నుంచి ఆలమూరు వైపు వస్తున్న రేషన్‌బియ్యంలోడు ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. దీంతో వ్యాన్‌లో ఉన్న సూరిబాబు, సాయిబాబులు అక్కడికక్కడే మృతి చెందారు. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న రమణ, శ్రీనివాస్, మావుళ్లస్వామిలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని ప్రథమ చికిత్స నిమిత్తం ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. మృతదేహాలను మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆలమూరు ఎస్ఐ శ్రీనునాయక్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలమూరులో విషాదఛాయలు



బతుకుతెరువులో భాగంగా తెల్లవారుజామునే ఇంటి నుంచి వ్యాన్‌లో వలలు వేసుకుని చెరువులలో చేపల వేటకు ఆలమూరు మత్స్యకారులు వెళుతుంటారు. దీనిలో భాగంగానే ఐదుగురు మత్స్యకారులు బొలెరావ్యాన్‌లో ఆలమూరు నుంచి రాజానగరం మండలం తుంగపాడు గ్రామంలోని చెరువులో చేపలవేటకు వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఇంటి నుంచి బయలుదేరిన పది నిమిషాల వ్యవధిలోనే ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఈప్రమాదంలో లంకే సూరిబాబు, వనమాడి సాయిబాబు మృతి చెందారు. మృతి చెందిన సూరిబాబుకు భార్య, కుమార్తు, కుమార్తె ఉన్నారు. మరో మృతుడు సాయిబాబుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈప్రమాదంలో మరో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. ఆలమూరు మత్స్యకారుల కాలనీతో తీవ్ర విషాదం నెలకొం ది. మృతుల కుటుంబాలు, బంధువులు బోరున విలపిస్తున్నారు.

అనుమానాస్పద మృతిపై వీడిన మిస్టరీ

- మద్యంమత్తులో హత్య

తునిరూరల్, మే 31: ఇటీవల కాకినాడజిల్లా తునిలో సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా రైల్వే ప్రహరీగోడ అనుకుని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కేసును పోలీసులు చేధించారు. ఈ వివరాలను తుని సీఐ సీతారామకృష్ణ వెల్లడించారు. తుని రైల్వేట్రాక్‌పై దేవుడురాజు బెగ్గింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడు యడ్ల అప్పారావు ఇరువురికి పరిచయం ఉంది. అప్పారావు రైళ్లలో ఖైనీలు, సిగరెట్లు అమ్ముతూ జీవనం సాగించేవాడు. తునిలో రైలు దిగిన ప్రతీసారీ దేవుడు రాజుతో కలిసి మద్యం తాగేవాడు. మే 25న ఇద్దరు కలిసి మద్యం తాగి డబ్బుల విషయంలో గొడవపడి అప్పారావు దేవుడురాజును ముఖం మీద కొట్టి కాళ్లతో తన్ని, తలను రోడ్డుకేసి గుద్దడంతో మృతి చెందాడు. దేవుడు రాజును అక్కడే వదిలేసి యడ్ల అప్పారావు యలమంచిలి వెళ్లిపోయాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితుడిని గుర్తించి పట్టుకున్న తుని టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్స్ కె.రాజాభూషణం, ఎం.నాగేశ్వరరావులను సీఐ అభినందించారు.

మాస్ మూవీ దేవకీ నందన వాసుదేవ

- హీరో అశోక్ గల్లా, దర్శకుడు అర్జున్ జంధ్యాల, నిర్మాత బాలకృష్ణ సోమినేని


సమావేశంలో మాట్లాడుతున్న హీరో అశోక్ గల్లా

రాజమహేంద్రవరం సిటీ, మే31 : దేవకీ నందన వాసుదేవ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని హీరో అశోక్ గల్లా, దర్శకుడు అర్జున్ జంధ్యాల ,నిర్మాత బాలకృష్ణ సోమినేని అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ షెల్టాన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హనుమాన్ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే ,దర్శకత్వం చేసిన ప్రశాంత్ వర్మ అందించిన కథతోనే ఈ సినిమా తెరకెక్కించినట్టు చెప్పారు. అశోక్ గల్లా మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ ఆశీస్సులతో ఆయన పుట్టిన రోజున శివజ్యోతి థియేటర్‌లో అభిమానుల సమక్షంలో దేవకీ నందన వాసు దేవ సినిమాలో కీలక పాటను విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇది మాస్ సినిమా అన్నారు. ఈ సినిమా తర్వాత తాను సితార ప్రొడక్షన్ బ్యానర్‌లో చేస్తున్నానని చెప్పారు. చిత్ర దర్శకుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ గుణ 369 సినిమా చేసిన తాను అశోక్ గల్లాతో సినిమా చేయడం ఆనందంగా ఉందన్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియా మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే బీఈడీ చేసి ఉపాధ్యాయుడిగా పనిచేసిన తాను సంగీత దర్శకుడిగా ఈ చిత్రానికి సంగీతం అందించి ఇక్కడే పాటను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. పాటను పాడి అలరించారు. నిర్మాత బాలకృష్ణ సోమినేని మాట్లాడుతూ సినిమాలో విశ్రాంతి తర్వాత వచ్చే సీన్‌ను ఎవరూ ఊహించలేరని అంత గొప్పగా ఈ సినిమా ఉంటుందన్నారు. మా సినిమాలో మంచి కథ ఉంది, కథనం ఉంది. దమ్ముందని తప్పకుండా అందరినీ అలరిస్తుందన్నారు.

రైలు ఢీ కొని మహిళ మృతి



తునిరూరల్, మే 31: గొల్లప్రోలు, రావికంపాడు రైల్వే స్టేషన్ మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని 35 సంవత్సరాల వయస్సుగల మహిళ మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు జరిగిన ఈ ఘటనను పోలీసులు పరిశీలించగా సంబంధిత మహిళ వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతురాలు ముక్కుపొడుము రంగుచీర, పింక్ కలర్ జాకెట్ ధరించి చామన ఛాయ రంగు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచామని సంబంధించినవారు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

రాళ్లు ఢీకొని బోటు ధ్వంసం

- రూ. 4లక్షల నష్టం

ఉప్పాడ(కొత్తపల్లి) మే 31: లంగర్ తాడు తెగిపోవడంతో రాళ్లను ఢీకొన్న సంఘటనలో బోటు అడుగుభాగం ధ్వంసమైన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో జరిగింది. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీజాన్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఉప్పాడకు నాయకర్ కాలనీకి చెందిన ఉమ్మిడి జగన్నాధంకు చెందిన బోటును వేట నిషేధం కారణంగా స్థానిక ఉప్పుటేరు కాలువలో లంగర్ వేశాడు. శుక్రవారం సముద్రంలో వచ్చిన పోటు,పాట్లకు కెరటాల ఉధృతికి లంగర్ వేసిన బోటు తాడు తెగిపోవడంతో పక్కనేఉన్న వంతెనరాళ్లకు బోటు ఢీకొట్టింది. దీంతో అడుగుభాగం పూర్తిగా పాడైంది. ఈసంఘటనలో సుమారు రూ.4లక్షల నష్టం వాటిల్లిందని సర్పంచ్ తెలిపారు.

గుమ్ముళూరులో వ్యక్తి అనుమానాస్పద మృతి

కోరుకొండ, మే 31: మండలంలోని గుమ్ముళూరులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ డి.ఆనంద్‌కుమార్ వివరాల ప్రకారం.. సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన మాదంషూడి రమేష్(35) గుమ్ముళూరుకు చెందిన చిన్న సత్యవతిని పెళ్లి చేసుకుని అత్తింటికి వచ్చేశారు. అదే గ్రామంలో వేరే ఇంటిలో కాపురం ఉంటున్నారు. వారికి 13 ఏళ్ల కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య తగాదాలు తలెత్తాయి. రమేష్ తాగుడుకు బానిసై కుటుంబ పోషణ పట్టించుకోవడంలేదని సత్యవతి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స అనంతరం ఇటీవల ఇంటికి వచ్చింది. అమ్మగారి ఇంటి వద్దే ఉంటోంది. దీంతో రమేష్ ఒక్కడే తన ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు కుమారుడు గణేష్ తన తండ్రిని చూడడానికి వచ్చాడు. ఇంట్లో వేలాడుతున్న తండ్రి మృతదేహాన్ని చూసి తల్లికి చెప్పాడు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కిందకి దించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ ఆనంద్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

ఆరోగ్య ప్రదాయిని..

- రోగ నిరోధక శక్తిని పెంచే పాలు
- ఆరోగ్యవంతమైన జీవనానికి పాలే ప్రధానం
- నేడు ప్రపంచ పాల దినోత్సవం


పాడి పశువులు



పాల ఉత్పత్తుల పెంపుదలపై వివిధ దేశాలు విడుదల చేసిన నాణేలు


పాల దిగుబడిలో పోటీపడే తార్‌పార్

అమలాపురంరూరల్, మే 31: ఒకప్పుడు పాడితోనే పంట ముడిపడి ఉండేది. అందుకే పాడిపంటలు అనేవారు. పాడి నుంచి ప్రకృతి సిద్ధంగా లభించే పెంటే ఎరువుగా పంటలు పండించేవారు. ఎటువంటి ఎరువులు, పురుగుమందులు వినియోగించేవారు కాదు. దాంతో ఆరోగ్యవంతమైన పంటలను రైతులు పండించేవారు. ఆరోగ్యవంతమైన పంట దిగుబడులతో రోగరహితంగా ప్రజలు ఒకప్పుడు జీవించారనడంలో ఎంతమాత్రం అతిశయోక్తికాదు. ఆధునిక సమాజం పాడినుంచి పంటను దూరం చేస్తుంది. పాడి పెంపకానికి అవసరమైన గడ్డి కూడా దొరకని పరిస్థితికి వ్యవసాయ యాంత్రీకరణ విధానాలు అందుబాటులోకి వచ్చేశాయి. వేలకు వేలు చెల్లించినా ఎండుగడ్డి దొరకని పరిస్థితి ఏర్పడింది. దాంతో పాడి పెంపకమంటేనే రైతులు భయపడిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీని ప్రభావం పాల ఉత్పత్తులపై తీవ్రంగా పడింది. పెరిగిన జనాభాకు అనుగుణంగా పాల ఉత్పత్తులు ఏనాడో తగ్గిపోయాయి. పాడిపంటల్లో ముందుండే కోనసీమ వంటి ప్రాంతాల్లోనే పాలను దిగుమతి చేసుకునే దుస్థితి ఏర్పడింది. దానికితోడు పాలపొడితో, కల్తీ పాలతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఆరోగ్యవంతమైన పాల దిగుబడులు కోసం ఐక్యరాజ్యసమితి నడుం బిగించింది. ప్రపంచ ఆహారసంస్థ ఆధ్వర్యంలో ప్రతిఏటా జూన్1న ప్రపంచ పాలదినోత్సవాన్ని నిర్వహించాలని ప్రకటించింది.

శ్రేష్ఠమైన ఆహారం పాలు

సృష్టిలో శ్రేష్ఠమైన ఆహారంగా మొదట చెప్పుకునేది పాలనే. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, ఒంటెలు, గాడిదలు..ఇలా క్షీరదజాతి పాడిపశువులు, జంతువులు పాల ఉత్పత్తులకు ముఖ్య వనరులుగా ఉన్నాయి. అనేక జబ్బులను తగ్గించుకునేందుకు, రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు వందలాది రూపాయలు వెచ్చించి గాడిద పాలు కొనుగోలుచేసి తాగుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆరోగ్యవంతమైన జీవనానికి పాలే ప్రధానంగా నిలుస్తాయి. పాలలో ఆరోగ్యానికి అవసరమైన ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు ఇతర పదార్థాలు పుష్కలంగా ఉండటంవల్ల సమీకృత ఆహారంగా పాలను ప్రకటించారు. రోగనిరోధక శక్తిని పెంపొందింపజేయడంతోపాటు తక్షణశక్తిని అందించేది పాలుమాత్రమే.

నెలకు 37,338 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి



జిల్లాలో 2.29లక్షల పాడి పశువుల నుంచి సగటున నెలకు 37,338 మెట్రిక్ టన్నుల పాల ఉత్పిత్తి జరుగుతుంది. దేశవాళీ ఆవులు, గేదెలను వేర్వేరుగా జెర్సీ, ముర్రా జాతి పశువులతో సంకరణం చేయడం వల్ల పాల ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. రాష్ట్రంలోని జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. రైతులకు అవసరమైన టోటల్ మిక్సడ్ రేషన్(టీఎంఆర్)ను అత్యధికంగా జిల్లాలోనే 80శాతం రాయితీపై పాడి రైతులకు అందజేశాం. గత రెండేళ్లలోను రూ.250 కోట్ల విలువైన టీఎంఆర్‌ను పాడి రైతులకు అందించాం.

● డాక్టర్ కర్నీడి మూర్తి,
డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ, అమలాపురం

జిల్లాలో ఆవులకంటే గేదెలే ఎక్కువ

జిల్లాలో తెల్లజాతి పశువుల కన్నా నల్లజాతి గోవులే అధికంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.29లక్షల పాడి పశువులు ఉండగా వాటిలో 1,53,542 గేదెలు, 75,460 ఆవులు ఉన్నాయి. పంజాబ్ నుంచి ముర్రా జాతి గేదెలను ఎక్కువగా దిగుమతి చేయడం జరిగింది. ముర్రా జాతి గేదెల వీర్యంతో దేశీయ గేదెలను సంకర పరచడం ద్వారా పాల ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. గేదెలకు మాత్రమే ఈ విధానాన్ని పరిమితం చేయలేదు. జెర్సీ ఆవులను దేశవాళీ ఆవులతో క్రాసింగ్ చేయడంవల్ల పాల ఉత్పత్తి పెరిగేలా ఆవుల పెంపకం జరిగింది.

పాలతో ప్రయోజనాలు

పాలు తాగడం వల్ల మనిషికి అవసరమైన కాల్షియం లభిస్తుంది. పచ్చి పాలలో పోషక విలువలు, కాల్షియం ఉన్నప్పటికీ రకరకాల సూక్ష్మజీవుల వల్ల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. గేదె పాలలో కొలస్ట్రాల్ శాతం తక్కువగా ఉండి మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. వెన్న శాతం గేదెపాలలోనే ఎక్కువగా ఉంటుంది. ఆవుపాలతో సమానంగా మేక పాలు మంచిని చేస్తుంటుంది. లాక్టోస్ సమస్యలు ఉన్న చిన్నపిల్లలకు ఆవుపాలకంటే మేక పాలు ఇవ్వడం మేలు, ఇక పాలతో ఎన్నో ఉపఉత్పత్తులు తయారవుతున్నాయి. పాల నుంచి ఉత్పత్తి అవుతున్న పన్నీర్‌కు మంచి డిమాండు ఉంది.

ఏజెన్సీ సమాచారం

చింతూరు తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్‌కు రాష్ట్రస్థాయి ప్రథమ అవార్డు



రాష్ట్రస్థాయి ప్రథమ అవార్డును అందుకుంటున్న చింతూరు తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్

చింతూరు, మే 31: చింతూరు డివిజన్ తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును శుక్రవారం విశాఖపట్నంలో చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ఎ.ప్రకాష్ అందజేశారు. తపాలాశాఖ ద్వారా నూతన ఖాతాల సేకరణలో ఈ ఏడాదికిగాను చింతూరు సబ్ డివిజన్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రం మొత్తంలో 120 సబ్ డివిజన్‌లు ఉండగా చింతూరు సబ్‌డివిజన్ ప్రథమస్థానంలో నిలవడం అభినందనీయమని ఎ.ప్రకాష్ అభినందించారు. అవార్డు గ్రహీత అబ్దుల్ మాట్లాడుతూ డివిజన్‌లో పని చేస్తున్న తపాలా ఉద్యోగుల సహకారమే ఈ పురస్కారం పొందడానికి ప్రధాన కారణమన్నారు. భవిష్యత్‌లో డి విజన్‌లో ఉద్యోగుల సహకారంతో మరింత గుర్తింపు వస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

వైద్యుల పనితీరు భేష్

కూనవరం, మే 31: కూనవరం ప్రభుత్వాస్పత్రిలో అప్పుడే పుట్టిన బిడ్డకు కేవలం వెయ్యి గ్రాములే ఉండడంతో ఆ బాలుడికి 50రోజులు చికిత్స అందించి రెండు కేజీల వరకు చికిత్స ద్వారా పెంచిన కోతులగుట్ట ప్రభుత్వ వైద్యులను తెలుగుదేశం పార్టీ నాయకురాలు, మాజీ జడ్పీటీసీ ఎడవిల్లి కన్యకాపరమేశ్వరి అభినందించారు. ఏజెన్సీ ప్రాంతంలో ముఖ్యంగా గిరిజనులు ఆరోగ్య పరిస్థితి గమనించి 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కోతులగుట్ట లో 30పడకల ఆసుపత్రి నిర్మించారన్నారు. ఆయన కృషి కారణంగా ఇప్పుడు గిరిజనులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ముఖ్యంగా వీఆర్‌పురం మండలానికి చెందిన రా ములమ్మ ఆరు నెలలకే ప్రసవించడంతో ఆ బాలుడు కేవలం వెయ్యి గ్రాములే ఉన్నాడని కానీ ఏజెన్సీలోను కార్పొరేట్ వైద్యమందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ మహేష్‌బాబు, గైనకాలజిస్టు శ్వేతతో పాటు ఆసుపత్రి సిబ్బంది, నర్సులను అభినందించారు.

ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ సేవలపై అవగాహన కల్పించాలి

● జిల్లా కోఆర్డినేటర్ డేవిడ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ డేవిడ్

రంపచోడవరం, మే 31: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా ప్రతినెలా 9వ తేదీన గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రులలో నిర్వహించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టరు టి.డేవిడ్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆరోగ్యమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత్ మాతృత్వ అభియాన్ సేవలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు వైద్య పరీక్షలు సక్రమంగా జరిగేలా ఆరోగ్యశ్రీ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి, వైద్యాధికారులు, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన టేకు చెట్లు కలప రూపంలో స్వాధీనం

● రంపచోడవరం డివిజన్ అటవీ అధికారి నరేంద్రన్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో, తదితరులు

రంపచోడవరం, మే31: మారేడుమిల్లి రేంజ్ పరిధిలోని టేకు ప్లాంటేషన్లలో నరికేసిన 378 టేకు చెట్లకు సంబంధించి గల్లంతైన మొత్తం కలపను స్వాధీనం చేసుకున్నామని రంపచోడవరం డివిజన్ అటవీ అధికారి నరేంద్రన్ తెలిపారు. గత కొన్ని నెలలుగా ఇక్కడ టేకుచెట్ల గల్లంతు నేపథ్యంలో మీడియాలో వస్తున్న కథనాలపై ఆయన శుక్రవారం సాయంత్రం మీడియా సమావేశంలో వివరణ ఇచ్చారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన ఎవర్నీ అటవీశాఖ ఉపేక్షించడం లేదని, చెట్లను ఎవరు నరికారన్న అంశంలో విచారణ సాగుతోందని అన్నారు. ఇప్పటివరకూ జరిగిన పలు విచారణలు, విజిలెన్సు విచారణల సారాంశం ప్రకారం తమ శాఖకు సంబంధించి బాధ్యులైన అధికారులను సస్పెండ్ కూడా చేశామని అన్నారు. చెట్లు నరికేసిన విషయం వెలుగుచూసిన అనంతరం తమ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారని, విచారణలో గల్లంతైన చెట్లు, వాటి పరిమాణాలను గుర్తించారని అన్నారు. అనంతరం గల్లంతైన చెట్ల కలపను ఎక్కడ దాచారో అన్న విషయంలో జరిగిన గాలింపులో మారేడుమిల్లి, రంపచోడవరం రేంజ్‌ల పరిధిలోనే వాటిని గుర్తించామని, గల్లంతైన చెట్ల కలప ఎక్కడికీ స్మగ్లింగ్ అవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. తమ డివిజన్‌లో అటవీ సంరక్షణ నిక్కచ్చిగా అమలు చేస్తున్నామని, ఇందులో ఎవర్నీ తాము ఉపేక్షించడం లేదని డీఎఫ్‌వో పేర్కొన్నారు. వన్యప్రాణి చట్టం కింద ఇటీవల తమ అధికారులు కట్టిన కేసులతో ఇబ్బందిపడిన వారే తమ అధికారులను ఇబ్బంది పెట్టేందుకే టేకు ప్లాంటేషన్ల చెట్ల గల్లంతుకు కారణమయ్యారని ఆయన పేర్కొన్నారు. రంపచోడవరం, అడ్డతీగల సబ్ డీఎఫ్‌వోలు కూడా పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపునకు రూట్ మ్యాప్ సిద్ధం

» జిల్లా కలెక్టర్ మాధవీలత.. లెక్కింపు కేంద్రాలు , స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

దివాన్‌చెరువు, మే 31: లెక్కింపు కేంద్రాల వద్దకు ఈవీఎంలు తీసుకురావడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, కె.మాధవీలత తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని లెక్కింపు కేంద్రాలను, స్ట్రాంగ్‌రూమ్‌లను జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్‌కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌లతో కలసి శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం ఓట్లు లెక్కింపు కోసం అసెంబ్లీ సిగ్మెంట్ (పార్లమెంటు) కోసం 98 టేబుళ్లు 116 రౌండ్లు, అసెంబ్లీ నియోజకవర్గాల కోసం 98 టేబుళ్లు, 116 రౌండ్లు మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ఈటీసీబీఎస్, పోస్టల్‌బ్యాలెట్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసామన్నారు. ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్వైజర్, సహాయకులు లెక్కింపు ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తారని తెలిపారు. తగిన గుర్తింపు కార్డులు లేని వారిని నన్నయ విశ్వవిద్యాలయంలోకి అనుమతించబోమన్నారు. ఆ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల తరపున జూన్ 4న ప్రతిపాదించే లెక్కింపు ఏజెంట్ల వివరాలు ఇవ్వాలని ఇప్పటికే తెలియజేశామన్నారు. వారికి సంబంధిత ఆర్వో ద్వారా గుర్తింపు కార్డులు, అధికారిక లేఖలు, వారి సంతకాలు నిర్ధారణ చేయనున్నామని కలెక్టర్ చెప్పారు. రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించే వారి గుర్తింపు నిర్ధారణ చేసుకున్న తరువాత మాత్రమే అనుమతించాలని భద్రత సిబ్బందికి తగిన సూచనలు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌నుంచి లెక్కింపు హాల్ వరకూ వచ్చే మార్గంలో సీసీ కెమెరాలను ఎస్పీ పరిశీలించారు. ఈ మార్గంలో మెష్‌లు ఏర్పాటు చేసి అత్యంత జాగ్రత్తగా తీసుకువచ్చిన ఈవీఎంలు తిరిగి స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరుస్తారని చెప్పారు. ఈవీఎంలు తీసుకువచ్చే వారికి నియోజకవర్గాల వారీగా డ్రెస్‌కలర్ కోడ్ ఇస్తూ అసెంబ్లీ, పార్లమెంటు వివరాలు ముద్రించనున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.చెంచురెడ్డి, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్

రాజమహేంద్రవరం, మే 31(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలిచ్చి డ్రైవింగ్ చేయడానికి కారణమైన వాహన యజమాని/ తల్లిదండ్రులు/సంరక్షకులు చట్టప్రకారం శిక్షార్హులని సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ హెచ్చరించారు. ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో మైనర్ల డ్రైవింగ్‌పై టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మైనర్లు నడుపుతున్న 30వాహనాలను స్వాధీనం చేసుకొని రూ.16వేలు జరిమానాలు విధించారు. మైనర్లకు, వారి కుటుంబ పెద్దలకు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సీఐ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు వీడ్కోలు చెప్పండి

» డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు
» ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

రాజమహేంద్రవరం రూరల్ మే 31: పొగాకుకు వీడ్కోలు చెప్పండి.. ఆరోగ్యానికి స్వాగతం పలకండి అని డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పొగాకు నిరోధక దినం సందర్భంగా ప్రజలను చైతన్యపరిచేలా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల కలిగే ప్రమాదాలను, ఆరోగ్యంపై దుష్ప్రభావాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. పొగాకు వాడకాన్ని తగ్గించడం, పూర్తిగా మాన్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. పొగాకు వాడకం వల్ల కేన్సర్, గుండె సంబంధిత, శ్వాసకోస వ్యాధులతోపాటు పునరుత్పత్తి సంబంధిత సమస్యలు, మధుమేహం, నాడి సంబంధిత, చర్మ సమస్యలు తలెత్తుతాయన్నారు. జిల్లా ఎపిడిమియాలజిస్ట్ సుధీర్‌బాబు మాట్లాడుతూ జిల్లా బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే జరిమానా, జైలు శిక్ష పడుతుందన్నారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల దూరంలో ఎటువంటి పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని పొగాకు నిరోధక కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కేంద్రాల్లో మానసిక నిపుణుడు రాజు సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి నేతల రాజకుమారి, జిల్లా ఎన్‌సీడీ అధికారి హరిశ్చంద్రప్రసాద్, అర్జునరావు, బడుగు రాజు, ఆలీ బేగ్, ఆశ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకుతో అనర్థాలపై అవగాహన

సీతానగరం, మే 31: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా సీతానగరం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యలో ఇనుగంటివారి పేటలో పొగాకు వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు మాట్లాడుతూ పొగాకును చుట్ట, బీడీ, సిగరెట్, పాన్ ఏ రూపంలో తీసుకున్నా మానవ శరీరంపై అనేక దుష్ప్రభావాలను కలిగించి క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలకు దారి తీస్తుందని, నరాలు గట్టిపడేలా చేసి చివరికి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తుందని, ఎవ్వరూ పొగాకు వాడరాదన్నారు. అనంతరం పొగాకు వాడను, వేరే వారిని వాడకుండా చూస్తానంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యువత పొగాకు పదార్థాలకు దూరంగా ఉండాలి

రాజమహేంద్రవరం అర్బన్, మే 31: రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది పొగాకు పరిశ్రమ జోక్యం నుంచి పిల్లలను రక్షించడం అనే నినాదాన్ని ఇచ్చిందన్నారు. యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ వీవీ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల ఏటా ఏడు లక్షల మందికి పైగా చనిపోతున్నారని డబ్ల్యూహెచ్‌వో లెక్కలు చెబుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణిమాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వి.సూర్యారావు, డాక్టర్ ఆర్.సురేంద్రబాబు, డాక్టర్ కె.దీపిక, డాక్టర్ ప్రసన్నకుమార్, ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థులు పాల్గొన్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకానికి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.



పొగాకు వాడకంతో అనర్థాలపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ

పంటల దిగుబడిలో విత్తన నాణ్యత కీలకం

» కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ నాయుడు
» కౌలు రైతులు కూడా విత్తనోత్పత్తి చేయొచ్చు
» జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు

రాజానగరం, మే 31: పంటల దిగుబడిలో విత్తనం నాణ్యత కీలక భూమిక పోషిస్తుందని, విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు సూచించారు. ఎన్ఎస్‌సీఎల్(గుంటూరు ప్రాంతీయ కార్యాలయం), కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ, మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం భాగస్వామ్యంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఇతర రైతులకు నాణ్యమైన విత్తనోత్పత్తి, నాణ్యత ప్రమాణాలు తదితర అంశాలపై కేవీకేలో శుక్రవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తొలుత నాయుడు మాట్లాడుతూ రైతులు కూడా విత్తన ఉత్పత్తిలో పరిశోధన స్థానాలు, విత్తనాభివృద్ధి సంస్థల్లో భాగస్వాములు కావచ్చని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ కౌలు రైతులు కూడా హక్కుదారు రైతులు మాదిరిగానే తమ కౌలు భూముల్లో విత్తన ఉత్పత్తి చేపట్టవచ్చని, విత్తన నాణ్యత ప్రమాణాల పరీక్ష(సీడ్ సర్టిఫికేషన్) ఆవశ్యకతను వివరించారు. రైతులు తమ కమతాల్లో చేపట్టడం ద్వారా ఆదాయం పెంచుకోవడంతో పాటు సాటి రైతుకు నాణ్యమైన విత్తనాల లభ్యతలో తోడ్పాడాలంటూ ప్రోత్సహించారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డయల్ ప్రసాద్‌బాబు పరిశోధనా స్థానంలో లభ్యమయ్యే వరి వంగడాలను వివరించారు. మృత్తిక విభాగం శాస్త్రవేత్త శ్రీనివాస్ నాణ్యమైన విత్తనోత్పత్తి పంటలో భూసారం, ఎరువుల యాజమాన్యం గురించి, కోరుకొండ సహాయ వ్యవసాయ సంచాలకుడు మల్లికార్జునరావు రైతు ఉత్పత్తుల సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ పథకాలను వివరించారు. ఎన్ఎస్‌సీఎల్ ఏరియా మేనేజర్ జగదీష్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ సీడ్ లైసెన్సింగ్ విధానం ద్వారా రైతులను విత్తనోత్పత్తికి ప్రోత్సహిస్తూ రైతులు పండించిన విత్తనాలను ఎన్ఎస్సీ కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు బి.నాగేశ్వరరెడ్డి, టి.విజయవర్ధన్, జె.ప్రభాత్‌నాయుడు, సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన 60 మంది రైతులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే..పోలీస్ ఉద్యోగం

» ఎస్పీ జగదీశ్.. రిటైర్డ్ ఎస్ఐలకు సత్కారం

రాజమహేంద్రవరం, మే 31(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగమంటే ప్రతిక్షణం ప్రజా భద్రతా విధుల్లో ఉన్నట్లేనని ఎస్పీ జగదీశ్ చెప్పారు. ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు సిబ్బందిని ఆయన ఘనంగా సత్కరించారు. ఎస్ఐలు జి.ఝాన్సీ (డబ్ల్యుఎస్ఐ 1508), పి.ప్రభుప్రసాద్ ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో వారిని ఎస్పీ సత్కరించారు. ఉద్యోగ అనంతర జీవితం సంతోషంగా సాగిపోవాలని ఆకాంక్షించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే నేరుగా తనను కలవొచ్చని, డిపార్టుమెంటు అండ ఎప్పుడూ ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనిల్‌కుమార్, ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, ఎల్.చెంచిరెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.రఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయిమహేశ్ తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన ఎస్ఐ ఝాన్సీని సత్కరిస్తున్న ఎస్పీ జగదీశ్

పరిపాలనాధికారి రామారావు సేవలు కీలకం : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, మే 31: జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి బీవీఎస్ రామారావు అందించిన సేవలు కీలకమైనవని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ ప్రశంసించారు. రామారావు పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో రామారావు మహాలక్ష్మి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్, రెవెన్యూ విభాగం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రీజనల్ మునిపల్ ఆర్‌డీగా పదవీ విరమణ పొందిన నాగళ్ల వీరవెంకట సత్యనారాయణను మునిపల్ కమిషనర్లు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. 1989 నుంచి ఉద్యోగ ప్రస్థానం ఆరంభించి డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రాజమహేంద్రవరం వరకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. సత్యనారాయణ వెంకటేశ్వరమ్మ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మునిసిపల్ ఆర్డీ సత్యనారాయణ దంపతులకు సత్కారం

గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకేకు అభినందన

బ్రిటీష్ నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ క్వీన్ మేరి నుంచి సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ పొందిన గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరెడ్డిని రాజమహేంద్రి మహిళా జూనియర్ కళాశాల కార్యాలయంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, గూడూరు రాధిక దంపతులు సత్కరించి అభినందనలు తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

కోరుకొండ, మే 31: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక రోజుశిక్షణా కార్యక్రమం శుక్రవారం శ్రీరంగపట్నం జడ్పీ హైస్కూల్లో జరిగింది. ప్రతి పాఠశాల నుంచి గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకం వంట చేసే వారు, ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన పథకం, వంట తయారు చేసే విధానంలో పాటించాల్సిన పద్ధతులను తెలియజేసి వారితో అక్కడే వంటలు చేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంఈవో టి.కుశలవదొర, ఎంఈవో2, సీఆర్పీలు పాల్గొన్నారు.

దేశ బాంధవి దువ్వూరి సుబ్బమ్మ

రాజమహేంద్రవరం అర్బన్, మే 31: దేశ బాంధవి దువ్వూరి సుబ్బమ్మ అని ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ, కళా గౌతమి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం దువ్వూరి సుబ్బమ్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన తొలి మహిళ దువ్వూరి సుబ్బమ్మ అన్నారు. తెలుగు విభాగాధిపతి పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ సుబ్బమ్మ తన గంభీర స్వరంతో పాటలు పాడుతూ అందరిలోనూ స్వాతంత్ర్య కాంక్షను రగిల్చారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం ఛైర్మన్ చీర్ల సీతారామనాయుడు, పీఏ కిషోర్‌బాబు, జే.జయప్రకాష్, ఏ.అయ్యప్ప శ్రీనివాస్, సత్యనారాయణ, సోమశేఖర్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజులోవ సంస్మరణ సభ



రాజమహేంద్రవరం అర్బన్, మే 31: రాజులోవ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరం విక్రమ హాల్లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసి ఇటీవల మృతిచెందిన రాజులోవ సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. రాజులోవ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రజా ఉద్యమాల్లో రాజులోవ రెండు దశాబ్దాలుగా కీలపాత్ర పోషించారన్నారు. చురుకైన కార్యకర్తను కోల్పోవడం ప్రజోద్యమానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీరాణి, కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్, కోనసీమ జిల్లా నాయకురాలు కృష్ణవేణి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ నాయకులు జోజి, రంపచోడవరం జిల్లా కార్యదర్శి పి.వెంకట్, టి.సావిత్రి పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన నల్లమిల్లి



అనపర్తి, మే 31: పోలింగ్ అనంతరం అమెరికా వెళ్లి స్వదేశానికి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబును అనపర్తి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పోలింగ్ జరిగిన విధానం, అనంతర పరిణామాలను చంద్రబాబుకు వివరించారు. అనపర్తి నియోజకవర్గంలో ఓట్ ట్రాన్స్‌ఫర్ జరిగిన తీరుపై నల్లమిల్లిని చంద్రబాబు అభినందించారు. అలాగే నియోజకవర్గంలో బీజేపీ, టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి కట్టుగా పనిచేశారని తప్పక విజయం సాధిస్తారని చంద్రబాబు అభినందించినట్టు రామకృష్ణారెడ్డి తెలిపారు.

కనకదుర్గమ్మకు 1116 అరిసెలు నివేదన

గోకవరం, మే31: గోకవరంలోని రాజా సెంటర్ సమీపంలో కనకదుర్గమ్మకు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు శుక్రవారం 1116 అరిసెలు నివేదించారు. శ్రీనివాసరావు మనవడు షన్విక కృష్ణ పాదాలతో నూతన అడుగులు వేసిన సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అరిసెలు నివేదించారు. అనంతరం వాటిని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనగోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధశర్మ పాల్గొన్నారు.

దివ్య కళాశాలలో సంగీత దర్శకుడు భీమ్స్ సందడి

రాజానగరం, మే 31: ప్రముఖ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో తెలుగు సినిమా సంగీత దర్శకుడు, గాయకుడు, పాటల రచయిత భీమ్స్ శుక్రవారం రాజానగరంలోని దివ్య విద్యాసంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఛైర్మన్ బర్ల సత్యనారాయణ మాట్లాడుతూ భీమ్స్ రాజానగరంలోని తమ విద్యాసంస్థలో బీఈడీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థి అని అన్నారు. అనంతరం భీమ్స్‌ను ఘనంగా సత్కరించారు.

విద్యుత్ కోతలు అరికట్టండి

గోకవరం, మే 31: మండలంలో విద్యుత్ కోతలను అరికట్టి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ఆశాఖ అధికారులకు మాజీ జడ్పీటీసీ పాలూరి బోస్ విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ఏఈ అశోక్‌ని శుక్రవారం బోస్, మాజీ ఎంపీటీసీ సాలెపు నలమహరాజు తదితరులు కలిసి విద్యుత్ సమస్యలను వివరించారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టానుసారంగా విద్యుత్ కోత విధించడం వల్ల వృద్ధులు, పిల్లలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రుళ్లు ఉక్కపోతలతో కంటిమీద కునుకు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఏఈ అశోక్ స్పందిస్తూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు బోస్ తెలిపారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ కనకబాబు

బిక్కవోలు, మే31: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవితా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ ఎస్.కనకబాబు తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం ఆయన బిక్కవోలులో నిర్వహించిన న్యూ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఎర్లీ ఇంటర్‌వెన్షన్, ప్రత్యేక విద్యా బోధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వ పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. ఆరుగురు పిల్లలను కేంద్రాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఐఈఆర్‌పీలు సన్యాసిరావు,ఎస్.శివాజీ పాల్గొన్నారు.

సంయమనం పాటించండి : సీఐ

కడియం, మే 31: ఈ నెల 4 ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు అంతా సంయమనం పాటించాలని సీఐ తులసీధర్ అన్నారు. ఎన్నికల కౌంటింగ్ నేపత్యంలో శుక్రవారం సాయత్రం కడియం పోలీస్‌స్టేషన్ వద్ద వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, కౌంటింగ్ ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు లేకుండా రోడ్డు మీద విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చులు చేయరాదన్నారు. ఒకరికొకరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకోకుండా ఆయా పార్టీలు కార్యకర్తలకు నాయకులు సర్ది చెప్పాలన్నారు.సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్‌యాక్టులు అమలులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎస్ఐ కృష్ణసాయి పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

కడియం, మే 31: క్రీస్తు బోధనలు అనుసరించడం ద్వారా మానవాళికి శాంతి చేకూరుతుందని డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ అన్నారు. వేమగిరితోటలో పెంతెకోస్తు ప్రార్థనా మందిరం 25వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు యేసయ్య సువార్త సభలు జరిగాయి. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్రీస్తు బోధనల ద్వారా శాంతి సమాజ స్థాపన జరుగుతుందన్నారు. టీడీపీ నాయకుడు చెల్లుబోయిన శ్రీనువాసు సమకూర్చిన వస్త్రాలను కిరణ్ పేదలకు అందించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. అలాగే చిలకలూరిపేట పాస్టర్ షేక్ ప్రభుకిరణ్, పాస్టర్ డి.ప్రసాద్, పి.జెమ్స్ తదితరులు క్రీస్తు సందేశాలు అందించారు. కార్యక్రమంలో చెల్లుబోయిన మణికృష్ణ, గుత్తుల కృష్ణ, వాశంశెట్టి నాగబాబు, జోగి చక్రవర్తి, గుత్తుల శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో నల్లమిల్లి మహాలక్ష్మి పూజలు

బిక్కవోలు, మే 31: అనపర్తి అసెంబ్లీ సీటు నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి కేటాయించాలంటూ ఆర్ఎస్.పేట యూత్ మొక్కును శుక్రవారం ఆయన సతీమణి మహాలక్ష్మి తీర్చారు. ఈ సందర్భంగా ఆమె పిఠాపురంలోని శ్రీకుక్కుటేశ్వరస్వామిని, పురుహూతికా అమ్మవార్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈమె వెంట ఆర్ఎస్. పేట యూత్ సభ్యులు మాడా మోహన్, నజీర్ తదితరులు ఉన్నారు.

వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

రంగంపేట, మే 31: మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం (వీఆర్వో) నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. రంగంపేటలో జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా కోడి ఆనందరావు, అధ్యక్షుడిగా కేవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా బి.గణపతి, కోశాధికారిగా డి.అబ్బులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘాభివృద్ధికి కృషిచేస్తామని కార్యవర్గ సభ్యులన్నారు. అనంతరం తహశీల్దార్ తలీఫ్‌పాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.

టాలెంట్ టెస్ట్ విజేతల వివరాలు వెల్లడి

అనపర్తి, మే 31: అనపర్తి జీబీఆర్ విద్యా సంస్థలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జీబీఆర్ విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత విద్య పథకానికి సంబంధించి ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల వివరాలను శుక్రవారం ఐఎంఏ వైద్యులు విడుదల చేశారు. రాయవరం చాణిక్య ఆసుపత్రి అధినేత డాక్టర్ జీఎమ్ఎన్ రెడ్డి, రమాదేవి హాస్పిటల్ అధినేత డాక్టర్ రమాదేవి విజేతల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల గవర్నింగ్ బాడీ సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, డీన్ జి.హరిప్రసాద్, హెచ్ఎమ్‌లు రామారావు, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

గోకవరం, మే 31: గోకవరంలో వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా నిర్వహించిన మగ్గం శిక్షణా తరగతులు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు ధ్రువపత్రాలను అందజేశారు. మగ్గం వర్క్‌కు ఎక్కువ డిమాండు ఉందని, శిక్షణ పొందిన ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ప్రియాంక, గంగ, బుజ్జి, వరలక్ష్మి, భవాని, కిరణ్, సౌమ్య, నాగమణి, మీనా, పూర్ణిమ, కుమారి పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

రంగంపేట, మే 31: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ముగిసాయి. శుక్రవారం జరిగిన ఒకేషనల్ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులకు గాను ఇద్దరూ హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. పరీక్షలు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సారా కేసుల్లో ముగ్గురి అరెస్టు

175 లీటర్లు స్వాధీనం..1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

గోకవరం, మే 31: మండలంలోని గోపాలపురం, రంపయర్రంపాలెం, అచ్యుతాపురం గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలు, విక్రయ స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ కె.నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, 175 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గోకవరం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు వివిధ ప్రాంతాల్లో సారా బట్టీలపై దాడులు నిర్వహించి 39కేసులు నమోదు చేసి 43మందిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి 1992లీటర్ల సారా ను స్వాధీనం చేసుకోవడంతోపాటు, 8200 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామన్నారు.



అన్ని మండలాల్లో 40 డిగ్రీలు పైనే..



జిల్లాలో మండలాల వారీగా నమోదైన ఉష్ణోగ్రతలను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ విడుదల చేసింది. శుక్రవారం జిల్లాలో అనపర్తిలో 40.6 డిగ్రీలు, బిక్కవోలులో 41.4, చాగల్లులో 38.9 , దేవరపల్లి -2 40.4 , గోకవరం 41.3 , గోపాలపురం 41.8, కడియం 40.5 , కోరుకొండ 41.1 , కొవ్వూరు 40.0 , నల్లజర్ల 42.0, నిడదవోలు 39.3 , పెరవలి 40.6 , రాజమహేంద్రవరం 42.0, రూరల్ 40.5 , రాజానగరం 40.3, రంగంపేట 40.6 ,సీతానగరం 41.8 , తాళ్ళపూడి 38.9, ఉండ్రాజవరం 40.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జూన్ 1,2 తేదీల్లో ఈ ఉష్ణోగ్రతల్లో స్వల్పమార్పులు ఉంటాయని సంస్థ తెలిపింది.



భానుడి దెబ్బకు..

భానుడి బంద్ : నిడదవోలులో నిర్మానుష్యంగా గణేష్‌చౌక్

విలవిల..

రోజురోజుకు మండుతున్న ఎండలు

- 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదు
- ఉదయం 8 గంటల నుంచే ఎండ
- రాత్రి 9 గంటలైనా తగ్గని ఉక్కపోత
- కరెంట్ కోతలతో బెంబేలు
- తట్టుకోలేక రోడ్డెక్కుతున్న జనం
- మరో రెండు రోజులు ఇంతే

రాజమహేంద్రవరం సిటీ, మే 31 : భానుడు పగ పట్టాడు.. భగ భగమండిపడుతున్నాడు.. తట్టుకో లేనంతగా ప్రతాపం చూపుతున్నాడు. జనం ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత ఆదివారం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది.. సుమారు ఐదు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో తారస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. ఉదయం 8 గంటలకు భానుడు వచ్చి ఒక్కసారిగా వేడి మంటలు పుట్టిస్తున్నాడు. రాత్రి సమయాల్లోనూ ఉక్కబోత తట్టుకోలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాత్రి 9 గంటలు దాటినా వాతావరణంలో ఏమాత్రం మార్పు రావడంలేదు. ఒక పక్క ఉక్కబోత.. మరో పక్క కరెంట్ కోతలతో జనం అల్లాడిపోతున్నారు.ఏప్రిల్ నెలలో 45 డిగ్రీల వరకూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటుపై క్రమంగా తగ్గి వాతావరణం పూర్తిగా చల్లబడింది. తుఫాన్ ప్రభావం కారణంగా మే నెల ఆరంభం నుంచి 35 నుంచి 40 డిగ్రీల మధ్య ఎండలు కాశాయి. మే నెలాఖరులో భానుడు ఉగ్రరూపం చూపాడు. జిల్లా ఎటు చూసినా గతంలో భారీ వృక్షాలు, పచ్చదనంతో నిండి ప్రశాంతంగా ఉండేది. దీంతో వాతావరణం చల్లగా ఉండేది. అయితే ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. కొన్ని చెట్లు అభివృద్ధి పనుల పేరుతో తొలగిస్తే మరికొన్ని సీఎం జగన్ పర్యటనల పేరుతో తొలగించారు. ఎండ వేడిమి గ్రహించి చల్లదనాన్ని ఇచ్చే చెట్లులేకపోవడం,మరొక పక్క రాజమహేంద్రవరం ,కొవ్వూరు వంటి నగరం, పట్టణాలలో సీసీ రోడ్లు వేసి ఉన్న చెట్లను తొలగించడం వల్ల 40 డిగ్రీల ఉష్ణోగ్రతనే తట్టుకునే పరిస్థితి కనిపించడం లేదు.ఈ నెల 29న గరిష్ఠం 42.0 కనిష్ఠం 30.0, 30వ తేదీన గరిష్ఠం 43.0 కనిష్ఠం 29.0 ,31న గరిష్ఠం 42.0 కనిష్ఠం 29.0 గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఈ ఎండలు సుమారు 45 డిగ్రీల ఉష్ణోగ్రతల స్థాయిని తలపించాయి. దీంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

జిల్లాలో సాధారణ రోజులతో పోల్చితే విద్యుత్ వినియోగం చాలా పెరిగింది. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఇళ్ళలో కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు వినియోగం పెంచేశారు. జిల్లాలో రాజమహేంద్రవరం సర్కిల్‌లో గత నెల 30 నాటికి విద్యుత్ సర్వీసులు19,86,842 ఉన్నాయి. విద్యుత్ సాధారణ డిమాండ్ 1139 ఎండబ్ల్యూ కాగా శుక్రవారం సాధారణ వినియోగం 22.691గా ఉంది. ఈ లెక్కన విద్యుత్ వినియోగం రెండింతలు పెరిగింది.ఈ నేపథ్యంలో ఎక్కడిక్కడ ఓవర్ లోడ్ పడి ఫీజులు కొట్టేయడం, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్యలు ఉత్పన్నమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే మరమ్మతులు చేస్తున్నారు.

రోజుకు 20 డీహైడ్రేషన్ కేసులు

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యధిక ఉష్ణోగ్రత బారిన పడిన వారు రోజుకు 20 మంది వైద్యం చేయించుకుని వెళుతున్నారని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. గత నెల రోజుల నుంచి ఈ సంఖ్య పెరుగుతూ వస్తుందని తెలిపారు. వివిధ పనులపై బయటకు వచ్చిన ప్రజలు ఎండ తీవ్రతకు గురై డీహైడ్రేషన్ చెంది ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకుని సాయంత్రానికి వెళ్లిపోతున్నారని చెప్పారు.ఒక్క జిల్లా ఆసుపత్రిలోనే రోజుకు సగటున 20 మంది చికిత్స చేయించుకుంటే ఇక ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ఇంతకు రెట్టింపు కేసులు వస్తున్నట్టు తెలిసింది.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నాం

వేసవిలో సాధారణంగానే విద్యుత్ వినియోగం పెరుగుతుంది. అధిక ఉష్ణోగ్రతలకు ప్రజలు ఏసీలు, ఫ్యాన్లు , ఎయిర్ కూలర్లు ఎక్కువగా వినియోగిస్తారు. దీని వల్ల ఓవర్ లోడ్ పడుతుంది. వేసవిలో వినియోగానికి తగినట్టుగా గతనెల 30వ తేదీ వరకు పనులు చేశాం. ఒక్కసారిగా వినియోగం పెరిగినా దానికి తగ్గట్టుగా సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నాం. **- టీవీఎస్ఎన్.మూర్తి, ఎస్ఈ ఏపీఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం**

ఎండలో తిరగవద్దు..



రాజానగరం : ప్రస్తుత వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేందుకు మంచి నీరు, కొబ్బరి నీరు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి. తప్పని సరి పరిస్థితుల్లో తప్ప ఎట్టిపరిస్థితుల్లోనూ ఎండలో తిరగరాదు. తప్పని సరి పరిస్థితుల్లో బయటకు వస్తే తగిన రక్షణ చర్యలు చేపట్టాలి. ఎండలో లేకపోయినప్పటికి జ్వరంగా గానీ, నీరసంగా గానీ, చెమటలు అధికంగా పడితే సమీపం లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకుని ఒక లీటర్ నీటిలో ఒక ప్యాకెట్ కలుపుకుని తాగాలి. ఎవరికైనా నీరసంగా ఉంటే ఓఆర్ఎస్ ద్రావణం వాడాలి. రోడ్లపై లభించే జంక్ ఫుడ్ తినడం మానేయాలి. ఏవిధమైన అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ బెనడిక్ట్, వైద్యాధికారి, పాలచర్ల పీహెచ్‌సీ



విద్యుత్ పునరుద్ధరించాలని ధర్నా

సీతానగరం,మే 31 : విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. రఘుదేవపురం గ్రామంలో గత మూడు రోజులుగా విద్యుత్ సర ఫరా సక్రమంగా ఉండడంలేదు. అంతేకాకుండా గురువా రం రాత్రి 2 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.దీంతో ప్రజలు ఆగ్రహానికి లోనయ్యారు. స్థానిక పంచాయతీ వీధి సమీపంలోని ప్రజలు సాయంత్రం 4 గంటలకు పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డుకు అడ్డంగా బైఠాయించి ధర్నా చేశారు. దీంతో సీతానగరం, రాజమహేంద్రవరం రోడ్డులో రాకపోకలకు తీవ్ర అంతరా యం ఏర్పడింది. స్థానికులు సవల మణికంఠ, సవల మోహన్, గారపాటి వినయ్, యు.రాజేష్ తదితరులు మాట్లాడుతూ గత రాత్రి 8 గంటల నుంచి ఇప్పటి వరకు విద్యుత్ లేదని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా కనీసం స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండలకు తోడు విద్యుత్ లేకపోవడంతో అధికారులు స్పందించకపోవడంతో గత్యంతరం లేక ధర్నా చేపట్టామ న్నారు.వెంటనే విద్యుత్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఏఈ చంద్రమోహన్ అక్కడకు చేరుకున్నారు.విద్యుత్ పునరుద్ధరించడంతో ధర్నా విరమింపజేశారు. ఏఈ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ మరమత్తు కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడిందని దానిని సరిచేసి విద్యుత్ ఇచ్చామన్నారు..



లో వోల్టేజ్ సమస్య తీర్చాలని సబ్ స్టేషన్ ముట్టడి..

అనపర్తి, మే 31 : అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వీదిలో గురువారం రాత్రి విద్యుత్ లోవోల్టేజి రావడంతో అనేక విద్యుత్ ఉప కరణాలు దగ్ధమయ్యాయి. దీంతో వినియోగదారులు అనపర్తి మండలం దుప్పలపూడి సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. వినియోగదారులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గురువారం రాత్రి లో వోల్టేజీ రావడంతో ఏసీలు, ఫ్రిజ్‌లు, వంటి అనేక గృహోపకరణాలు దగ్ధమయ్యాయని వాపోయారు. రాత్రి ఇంత జరిగినా కనీసం గ్రామంలోని లైన్‌మెన్ కూడా రాలేదని ఎన్నిసార్లు ఫోన్‌లు చేసినా స్పందించలేదని వినియోగదారులు వాపోయారు. సర్పంచ్ కర్రి బులిమోహ నరెడ్డి, మాజీ సర్పంచ్ కర్రి వెంకటరామారెడ్డి గ్రామంలోని విద్యుత్ సమస్యలను ఏఈ వీరభద్రరావుకు వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్ వీధిలో గతంలో 100కెవీ ట్రాన్స్ ఫార్మర్ ఉండేదని దానిని తొలగించి డబ్బా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో సమస్య తలెత్తిందన్నారు. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఏఈ హామీ ఇవ్వడంతో వినియోగదారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

పండుటాకులపై పగ



పింఛనుకు ఈ నెలా తప్పని తిప్పలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మండుటెండలోనూ పండుటాకులపె పగ సాధిస్తున్నాడు జగన్. ఉష్ణోగ్రతలు 40 దాటి జిల్లా సలసలా మరుగుతోంది. రాత్రి 9 గంటలు దాటినా గుబులు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.అయినా పింఛన్లు ఈ నెల కూడా బ్యాంకుల ద్వారానే ఇవ్వాలని నిర్ణయించింది.మే నెలలో ఇలాగే చేసి పండు టాకుల ప్రాణాలను ఎండకు బలి చేసింది. అయినా పింఛను లబ్ధిదారులపై దయ కలగడం లేదు.ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న విడుదలైంది. ఆ నెల పింఛను ఏప్రిల్‌లో సచివాలయ సిబ్బంది ద్వారా సునాయాసంగా పంపిణీ చేశారు. వలంటీర్లు లేకపోతే ఏదో జరిగిపోతోందనేది అనవసర భ్రమ మాత్రమేనని తేలిపోయింది.టీడీపీపై వేద్దామనుకున్న బురద తిరిగొచ్చి వైసీపీ పాలకులపై పడింది. దీంతో పన్నాగానికి మరింత పదును పెట్టారు. పర్యవసానంగా వృద్ధులు, మహిళలు పింఛను కోసం ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోంది. పైగా జనవరి నుంచి చూస్తే జూన్ 1కి వచ్చే సరికి జిల్లాలో సుమారు 6వేల పింఛన్లు 'గాలి'లో కలిసి పోవడం గమనార్హం.

మళ్లీ అదే పాపం

ఎన్నికల సంఘం వలంటీర్లను సంక్షేమ పథకాల పంపిణీ నుంచి పక్కన పెట్టింది. దీంతో వాళ్లు లేకపోతే పింఛన్ల పంపిణీ కష్టమవుతుందంటూ ఓ భ్రమతో కూడిన భయాన్ని జనాల్లోకి తీసుకెళ్లాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించింది.కానీ మార్చి నెల పింఛన్‌ని ఏప్రిల్‌లో సచివాలయ సిబ్బంది ఎక్కడా ఇబ్బంది లేకుండా అందజేశారు. దీంతో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డ వైసీపీ ప్రభుత్వం డీబీటీ విధానంలో బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తామంటూ లబ్ధిదారుల ప్రాణాలతో చెలగాటం ఆడే కుట్ర చేసింది. ఏప్రిల్ నెల పింఛన్‌ని బ్యాంకుల్లో జమ చేసింది. అయితే పింఛనుదారుల ఖాతాలు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు.జిల్లాలోని సుమారు 2 వేల మంది ఖాతాల్లో డబ్బు జమ కాలేదు. దీంతో మళ్లీ వారికి నేరుగా అందజేయాల్సి వచ్చింది. బ్యాంకుల దగ్గర లబ్ధిదారులు గంటల కొద్దీ ఎండలో వేచి చూడాల్సి వచ్చింది. బ్యాంకులకు రావడం, ఖాతాల్లో పడిన డబ్బులను డ్రా చేసుకొని ఇంటికి వెళ్లడం ప్రహసనంగా మారింది. ఎండ వేడిమిని తట్టుకోలేక వృద్ధులు ప్రాణాలు కోల్పోయారు. ఆ పాపాన్ని టీడీపీపైకి నెట్టేయాలని చూసిన జగన్.. ఏప్రిల్ నెల మాదిరిగా సచివాలయ సిబ్బందితో ఎందుకు పింఛన్లు పంపిణీ చేయలేదనే ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయారు. మళ్లీ అదే పాపాన్ని జూన్ నెలలోనూ చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా పింఛన్లు పంపిణీ చేయడానికి సిద్ధమయ్యారు. ఈ విధానం బ్యాంకులకు కూడా తలనొప్పిగా మారింది. పింఛను లబ్ధిదారులు బ్యాంకులకు పోటెత్తడం, చాలా మంది ఖాతాల్లోని సమస్యలను సరిచేయడం వంటివి సిబ్బందిని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయి. సచివాలయాలు ఉండగా బ్యాంకుల్లో డబ్బు జమ చేయడం ఎందుకని బ్యాంకు సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. రాజకీయ ఎత్తుగడలతో ఇటు బ్యాంకు సిబ్బందిని, అటు లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది ఉన్నా..

జిల్లాలోని 300 పంచాయతీలు, 3 నగరపాలికల పరిధిలో 512 సచివాలయాలు ఉండగా వాటిలో సుమారు 4 వేల మంది సిబ్బంది ఉన్నారు. ఈ నెల మొత్తం 2,42,300 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. వీటిలో 71,232 మందికి ఇంటికి వెళ్లి అందజేస్తారు. 1,71,068 మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే, వీళ్లకు కూడా 4వేల మంది సచివాలయ సిబ్బందిలో 3వేల మందిని పింఛన్లకు వినియోగించినా.. రోజుకు 6గంటలు గంటకు 10 మంది చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తే ఒక్క రోజులో అందరి చేతిలోనూ పింఛను డబ్బులు పెట్టవచ్చు. అప్పుడు ప్రభుత్వం జిల్లాకు సంబంధించి మొత్తం రూ.71,92,17,000 ఒకేసారి బ్యాంకు ఖాతాలకు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం కొద్ది కొద్దిగా జమ చేస్తుండడంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది.

ఆధునికీకరణ.. గాలికే!



శెట్టిపేట స్లూయిజ్

- ఐదేళ్లుగా ఆధునికీకరణ హుష్‌కాకి
- కాలువలను గాలికొదిలేసిన వైనం
- పనులూ లేవు.. ప్రతిపాదనలు లేవు
- మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థ
- శివారుప్రాంతాలకు అందని నీరు
- లబోదిబోమంటున్న రైతాంగం

నిడదవోలు, మే 31 : గోదావరి డెల్టాకు ఆధునికీకరణే ప్రాణం. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని శివారు ప్రాంత భూముల రైతాంగానికి ఆధునికీకరణ గొప్పవరం. డెల్టా ఆధునికీకరణపై రైతాంగం ఆశలను ప్రతి ఏటా వైసీపీ ప్రభుత్వం ఏదో ఒక కారణంతో నట్టేట ముంచేస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో గత ఐదేళ్ల వివిధ కారణాలతో ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. సొమ్ములు ఉన్నా పని పూర్తి కాని పరిస్థితి.ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది ఆధునికీకరణ పనులకు సంబంధించి ఎటువంటి ప్రక్రియ సాగలేదు.అసలు యాక్షన్ క్లోజర్ ప్లాన్ లేకుండా పోయింది. ప్రతిపాదనలు లేవు పనులు లేకుండానే శనివారం ఉదయం 11 గంటలకు నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద పశ్చిమ డెల్టా కాలువలకు నీటి పారుదల శాఖాధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి డెల్టాలైన తూర్పు, సెంట్రల్, పశ్చిమ డెల్టాల పరిధిలోని ఆధునికీకరణ అవసరంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

2007 నుంచి ఆధునికీకరణ...


గోదావరి డెల్టా ఆధునికీకరణకు 2007 నవంబరు నెలలో సమావేశం నిర్వహించి శ్రీకారం చుట్టారు. గోదావరి జిల్లాల్లో డెల్టా సిస్టంను 24 ప్యాకేజీల కింద విభజించి ఐదు వేల కోట్లతో 2008వ సంవత్సరంలో 258 జీవోను ప్రభుత్వం విడుదల చేసింది.ఆధునికీకరణ జరిగితే డెల్టాల పరిధిలో తూర్పు,సెంట్రల్, పశ్చిమ డెల్టాలలో ఖరీఫ్‌లో సుమారు 10 లక్షల పైగా ఎకరాలకు, రబీలో సుమారు 9 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో నీరందనుంది.

నేటికీ 20 శాతమే పనులు..

తాతల నాటి కాలంలో సుమారు 140 ఏళ్ల కిందట గోదావరి కాలువలు ఏర్పడ్డాయి. గోదావరి పరీ వాహక ప్రాంతంలో ఉన్న కాలువల స్లూయిజ్‌లు, లాకు లు, రెగ్యులేటర్లు,నదులకు పక్కన కట్టిన గోడలు శిథిలావస్థకు చేరడంతో గోదావరి శివారు ప్రాంతాల్లో నీరందక రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. దీని కోసం గోదావరి డెల్టాకు ఆధునికీకరణ ఎంతో అవసరం అయింది. గోదావరి డెల్టా పరిధిలోని శిథిలావస్థకు చేరుకున్న కట్టడాలు,లాకులు, రెగ్యులేటర్లు,స్లూయిజ్‌ల నిర్మాణాలతో పాటు ఇతర పనులు చేయవలసి ఉంది. ఇప్పటి వరకు 20 శాతం మాత్రమే పనులు జరగ్గా ఏ ఏడాదికాఏడాది క్షేత్రస్థాయిలో పనులు ఆలస్యం కావడం అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాలతో సమయం సరిపోక ఆధునికీకరణ పనులు మందగించాయి.ఆధునికీకరణ పూర్తయితే మరో వందేళ్ల పాటు డెల్టాలో రైతాంగం వెనక్కి చూసుకునే పరిస్థితే ఉండదు.

ఆధునికీకరణకు జాప్యమిదే..

ఆధునికీకరణలో చేపట్టవలసిన పనులకు ఆఖరి నిమిషంలో ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం టెండర్లను ఖరారుచేయడం క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించే నాటికి కాలువల్లో తడి ఆరకపోవడం వంటి కారణాలతో పాటుగా ఈ పనులు నిర్వహించడానికి కాంట్రాక్ట్ ఏజెన్సీలు సకాలంలో ముందుకు రాకపోవడం కూడా ఒక కారణం.నవంబరు నుంచి జూన్ వరకు రెండో పంటకు కాలువల ద్వారా నీరివ్వకుండా ఉంటే పనులు వేగవంతం అవుతాయి అనేది కాంట్రాక్ట్ ఏజెన్సీల వాదన. రెండో పంటకు కూడా నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయాలనేది రైతాంగం డిమాండ్. దీనికి రాజకీయ ఒత్తిళ్ళు తోడవడం వంటి కారణాలను కాంట్రాక్ట్ ఏజెన్సీలు ఎత్తి చూపుతున్నాయి.రెండో పంటకు నీటిని ఆపితే పూర్తి స్థాయిలో ఆధునికీకరణ పనులను చేయవచ్చనేది కాం ట్రాక్ట్ ఏజెన్సీల వాదన.



శెట్టిపేట ఆధునికీకరణింతేనా?

ఆధునికీకరణ పనులు మరమ్మతుల నిర్వహణ పనులు చేపట్టకపో వడంతో నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి నిడదవోలు మండలం శెట్టిపేట వైర్ వద్ద ఉన్న గేట్ల నుంచి యథేచ్ఛగా గోదావరి జలాలు వృథాగా పోతు న్నా నీటిపారుదల శాఖాధికారులు అటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు.పశ్చిమ డెల్టా హెడ్ స్లూయిజ్ పరిధిలో ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లాలో 5.30 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. అలాంటి హెడ్ స్లూయిజ్ సైతం ఈ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైం ది.శివారు ప్రాంత రైతాంగానికి ఈ ఏడా ది సాగునీరు సరఫరాలో సమస్యలు తప్పేటట్లు లేవు.

నేడు కాలువలకు నీరు విడుదల

ఈ ఏడాది మే 10వ తేదీన గోదావరి డెల్టా పరిధిలోని తూర్పు మధ్యమ పశ్చిమ డెల్టాలకు సాగునీటి విడుదలను నిలిపివేశారు. సుమారు 22 రోజుల తరువాత అనగా జూన్ 1వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు గోదావరి డెల్టాలకు నీటిని విడుదల చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆధునికీకరణ ఊసే లేకపోయినా మరమ్మతుల నిర్వహణ పనులకు సంబంధించి పశ్చిమ డెల్టా పరిధిలో 164 పనులకు రూ.17 కోట్ల పను లకు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి అను మతులు రాక ఆధునికీకరణ పనులతో పాటు మరమ్మ తుల నిర్వహణ పనులు ఈ ఏడాది హుష్ కాకే.

డెల్టాల పరిధిలో ఆయకట్టు వివరాలు

డెల్టాలు	ఖరీఫ్	రబీ
తూర్పు డెల్టా	2,81,303	2,64,533
సెంట్రల్ డెల్టా	2,01,896	1,72,000
పశ్చిమ డెల్టా	5,29,965	4,69,000
మొత్తం	10,13,161	8,96,533

77,817 ఎకరాల్లో ఖరీఫ్

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, మే 31: జిల్లా వ్యాప్తంగా 77.817 హెక్టార్లలో ఈ ఖరీఫ్ సాగులో వరి పండించినట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు. తొర్రేడులో శుక్రవారం వరి నారుమళ్ళను ఆయన పరిశీలించారు. ఖరీఫ్ పంటల కోసం భూసారాన్ని పెంపొందించేందుకు పశువుల ఎరువుకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్టు డీఏవో తెలిపారు. ఈ ఖరీఫ్‌లో 58,356 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా జిల్లాలో ఇప్పటికి 23,096 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్లు వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు రసీదు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఏ భీమరాజు, వీఏవో ఎన్‌డి శ్రీనివాస్, విశాలాక్షి, రమాదేవి, రైతులు దండమూడి రవికుమార్ పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపునకు రూమ్ మ్యాప్ సిద్ధం

8



నన్నయ వర్సిటీలో లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఇక మూడు రోజులే

- 4న కౌంటింగ్‌కు ఏర్పాట్లు సిద్ధం
- నేడు ఎగ్జిట్‌పోల్ ఫలితాలు
- సర్వత్రా ఉత్కంఠ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇక మూడురోజులే ఉంది.ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రకటించడానికి అవసరమైన ఏర్పాట్లన్నీ చకచకా నడుస్తున్నాయి. 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు ఆరంభమవుతుంది. మంగళవారం ఉదయం 4.30 గంటల నుంచే సంబంధిత ఓట్ల లెక్కింపు అధికారులు అక్కడకు చేరుకుంటారు. జిల్లాలో మొదటి ఫలితం కొవ్వూ రు అసెంబ్లీ నియోజకవర్గానిదే అవుతుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ఫలితం చివరిలో వస్తోంది.ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఇప్పటికే ఓటర్ల నాడి, సర్వేలు చెబుతున్నాయి.అయినా టెన్షన్ వెంటాడుతోంది. ఇప్పటికే అభ్యర్థులంతా సర్వేలు చేయించుకున్నారు. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా ఎగ్జిట్‌పోల్ సర్వే ఫలితాలతో కాస్త ఊరట పొందడం అలవాటైపోయింది. దీనికి కారణం కొన్ని ఎగ్జిట్‌పోల్ సర్వేలు నిజం కావడం. కౌంటింగ్ రోజు కంటే ముందుగానే ఒక విధంగా ఫలితాలు ఎలా ఉంటాయనేది, ఎవరు అధికారంలోకి వస్తారనే విషయాలను ఈ ఎగ్జిట్‌పోల్ సర్వేలు స్పష్టం చేస్తుంటాయి. గతంలో పోలింగ్ జరిగిన వెంటనే ఈఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాలు ప్రకటించేవారు.కానీ సార్వత్రిక ఎన్నికలు దేశవ్యాప్తంగా జరుగుతుండడంతో అన్ని ప్రాంతాల్లో ఎన్నికలు పూర్తయ్యేవరకూ ఎగ్జిట్‌పోల్ ఫలితాలు ప్రకటించకూడదనే ఆంక్షలను ఎన్నికల కమిషన్ విధించింది.దీంతో అన్ని ప్రాంతాల్లో ఎన్నికలు ముగిసిన తర్వాతే వీటిని ప్రకటిస్తారు. దేశంలో మొత్తం ఏడు విడతలుగా ఎన్నికలను ప్రకటించారు.ఇప్పటికే ఆరు విడతల ఎన్నికలు జరిగిపోయాయి. శనివారం ఏడో విడత అంటే చివరి విడత పోలింగ్ జరగనుంది.ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరనుంది.ఈ పోలింగ్ ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్ ఫలితాలు దేశవ్యాప్తంగా విడుదల చేస్తారు. శనివారం సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్ ఫలితాలు విడుదల చేస్తారు. దీంతో చాలా వరకూ టెన్షన్ తగ్గినట్టు అవుతుంది. గెలిచేవారిలో ఆనందం పెరిగిపోతుంది. ఓటమి చెందేవారిలో వణుకు మొదలవుతుంది. చివరి ఫలితం 4న వెలువడుతోంది.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

టీడీపీ నాయకుడికి సైకిల్ బొమ్మ బహూకరణ



సైకిల్ బొమ్మను సుబ్రహ్మణ్యంకు అందజేస్తున్న కూటమి అభ్యర్థి ముప్పిడి

కొవ్వూరు, మే 31: మన టీడీపీ యాప్ ద్వారా 1,30,000 మెసేజ్‌లు ఫార్వర్డ్ చేయడంతో ఆరికిరేవులకు చెందిన యనమదల సుబ్రహ్మణ్యంకు పార్టీ అధినేత చంద్రబాబు సైకిల్ బొమ్మను పంపారు. ఆ సైకిల్‌ను శుక్రవారం ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో నియోజకవర్గ కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు సుబ్రహ్మణ్యానికి అందజేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంను ద్విసభ్య కమిటీతోపాటు దాయన రామకష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, మద్దిపట్ల శివరామకష్ణ, నామాన పరమేష్, సూర్యదేవర రంజిత్, ఆళ్ళ హరిబాబు తదితరులు అభినందించారు.

సీతంపేటలో కార్డెన్ అండ్ సెర్చ్



సీతంపేటలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొవ్వూరు, మే 31: గ్రామీణ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శుక్రవారం మండలంలోని సీతంపేటలో సీఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ కె. సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలు, అల్లర్లు, గొడవలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో శుక్రవారం సీతంపేటలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్‌చేసి అపరాధ రుసుములు విధించామన్నారు. తనిఖీల్లో పట్టణ ఎస్ఐ జుబేర్ మహ్మద్, చాగల్లు ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం

కొవ్వూరు, మే 31: గాంధీ సినిమా వచ్చే వరకు గాంధీ ఎవ్వరో ప్రజలకు తెలియదని ప్రధాని నరేంద్రమోదీ అనడం అతని దిగజారుడుతనానికి నిదర్శనమని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం రవిప్రకాష్ విమర్శించారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో పెరిగిన మోదీకి గాడ్సే మాత్రమే తెలుసునని అందుకే ఇన్ని రోజులు గాంధీ గొప్పతనాన్ని జీర్ణించుకోలేక 1982 వరకు గాంధీని కించపరిచే విధంగా మాట్లాడుతున్నారన్నారు. దేశ ప్రజలకు ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బ్రిటీష్ వారితో కలిసి పనిచేసిన ఆర్ఎస్ఎస్‌ని సమర్థిస్తున్నందున ఆ విధంగా మాట్లాడుతున్నారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో ఓటమి చెంది కేంద్రంలో అధికారం కోల్పోతామని భయంతో మతిభ్రమించినట్లు మోదీ రోజుకో అంశాన్ని తెరమీదకు తెస్తున్నారన్నారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నందున ప్రజలు రోడ్లపైకి రావడం లేదని, లేనిచో పెద్దఎత్తున ఆందోళన చేపట్టేవారమన్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

కొవ్వూరు, మే 31: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో జూన్ 1వ తేదీ నుంచి 5 రోజుల పాటు హనుమద్ జయంతోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయార్చకుడు గోవర్ధనం అనంతగోపాల్ తెలిపారు. శనివారం హనుమత్ జయంతి సందర్భంగా పంచామృతాలతో స్నపన, తమలపాకులతో సహస్రనామార్చన, ఆదివారం బంతిపూలతో, సోమవారం సిందూరంతో, మంగళవారం గులాబీలతో, బుధవారం మల్లిపూలతో సహస్రనామార్చనలు జరుగుతాయని చెప్పారు.

అభయాంజనేయస్వామి వార్షికోత్సవాలు



పెరవలిలో అభయాంజనేయస్వామిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

పెరవలి, మే 31: పెరవలిలో అభయాంజనేయస్వామి వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో స్వామి వారి రథంపై గ్రామమంతా ఊరేగించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. శనివారం స్వామి వారికి లక్ష తమలపాకుల పూజ, గంధ సింధూర పూజ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

శ్రీరామచంద్రారెడ్డి పదవీ విరమణ

పెరవలి, మే 31: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారిగా పనిచేసిన శ్రీరామచంద్రారెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు

ఉండ్రాజవరం, మే 31: మండలంలోని పాలంగి కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖమాసం సందర్భంగా 208 తామరపువ్వులతో అమ్మవారిని అలంకరించారు. పూజా కార్యక్రమాల్లో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, పాలాటి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

ఉండ్రాజవరం, మే 31: మండలంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని పాలంగిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. గ్రామస్థులు బొక్కా శ్రీనివాస్, అసంజాని తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉండ్రాజవరం పీహెచ్‌సీ వద్ద ఆర్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పొగాకు వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న బైక్

ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

నిడదవోలు, మే 31: నిడదవోలు మండలం సమిశ్రగూడెం శివారున శుక్రవారం ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొని ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వెళుతున్న ఆర్టీసీ బస్సును నిడదవోలు నుంచి వాడపల్లి వైపు బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులు వాడపల్లికి చెందిన కొండ ప్రవీణ్, గెల్లా ప్రదీప్, సిర్రా నిరీక్షణ్‌లుగా గుర్తించారు. వారిని 108లో నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమిశ్రగూడెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామాలయ వార్షిక కల్యాణోత్సవం

తాళ్లపూడి, మే 31: తాళ్లపూడిలోని బీసీ కాలనీ రామాలయంలో శుక్రవారం వార్షిక కల్యాణోత్సవం నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో విశ్వక్సేన పూజ, ధ్వజారోహణం, మండపారాధన చేపట్టారు. ఉదయం గ్రామోత్సవం, అనంతరం గోపూజ సీతారాముల కల్యాణం, సాయంత్రం లక్ష తులసి పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'మానవత' నూతన కార్యవర్గం నియామకం

తాళ్లపూడి, మే 31: మానవత సంస్థ మండల నూతన కార్యవర్గాన్ని గౌరవ చైర్మన్ శింహాద్రి జనార్దనరావు ప్రకటించారు. తాళ్లపూడిలో సంస్థ నెలవారీ సమావేశం అధ్యక్షుడు సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాదికి నూతన కమిటీకి అధ్యక్షుడిగా అంకెం సురేష్‌కుమార్, కార్యదర్శిగా సనపల రాజశేఖర్, కోశాధికారిగా అప్పన హనుమంతరావును నియమించినట్టు తెలిపారు. సమావేశంలో గోకవరపు బాబులు, గెడ్డం సాయిబాబా, దుగ్గిరాల సూర్యనారాయణ, తిగిరిపల్లి దోసాలు, అప్పన హనుమంతరావు, అంకెం సురేష్‌కుమార్, పెమ్మాడి దుర్గాప్రసాదు పాల్గొన్నారు.

భగభగ

- సూర్యతాపంతో అల్లాడుతున్న ప్రజలు
- అధిక ఉష్ణోగ్రతలతో జనం విలవిల
- కరెంటు కోతలతో సతమతం
- రహదారులన్నీ నిర్మానుష్యం.. దుకాణాలు వెలవెల
- నదీ స్నానాలతో సేదదీరుతున్న కొవ్వూరు వాసులు



నిర్మానుష్యంగా మారిన గోపాలపురం జాతీయ రహదారి

కొవ్వూరు/పెరవలి/నల్లజర్ల/నిడదవోలు/గోపాలపురం/తాళ్లపూడి, మే 31: భానుడు భగభగ మండుతున్నాడు. వేసవికాలం రోహిణికార్తె కావడంతో వేసవితాపంతో ప్రజలు అల్లాడుతున్నారు. పది రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఉక్కపోత, వేడిగాలులతో పాటు అత్యధికంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో రాష్ట్రం నిప్పుల కుంపటిలా మారింది. ఉదయం 9గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విపరీతమైన ఉక్కపోత, వేడి గాలులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఠారెత్తిస్తున్న ఎండలకు భయపడి అధికశాతం ప్రజలు ఇంటికే పరిమితమవుతున్నారు. దీనికి తోడు తరచుగా కరెంటు కోతలతో వినియోగదారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయటకు రాలేక ఇంట్లో ఉక్కబోతలు భరించలేక సామాన్యులు తల్లడిల్లిపోతున్నారు. కరెంటు ఉన్న సమయంలోనైనా ఫ్యాన్ కింద కూర్చున్నా వేడిగాలులు రావడంతో ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నారు. వ్యాపారస్తులు సైతం దుకాణాలను మూసివేసి ఇంటికి వెళ్లిపోతున్నారు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కొవ్వూరు బస్టాండ్ సెంటర్, విజయ విహార్, లాంచీలరేవు, సినిమా థియేటర్ సెంటర్, అల్లూరి సీతారామ రాజు సెంటర్లు జనం లేక వెలవెల బోతున్నాయి. సాయంత్రం నాలుగు అయితే చాలు వేసవితాపం నుంచి ఉపశమనం పొందడానికి కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు గోదావరి నదీ స్నానానికి గోష్పాదక్షేత్రానికి చేరుకుంటున్నారు. నదిలో స్నానమాచరిస్తూ సేదదీరుతున్నారు. దీంతో వేసవిలోను గోష్పదక్షేత్రం స్నానం ఆచరించడానికి వచ్చిన యాత్రికులు, పర్యాటకులతో కిటకిటలాడుతుంది. అయితే నది లోతు ఎక్కువగా ఉండడంతో స్నానఘట్టాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు గాని, పోలీసు భద్రతగాని లేకపోవడంతో స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిడదవోలులోని గణేష్‌చౌక్ సెంటర్, నిడదవోలు-సమిశ్రగూడెం బ్రిడ్జి నిర్మానుష్యంగా మారిపోయింది. అలాగే ఎండల ప్రభావంతో పశువుల పాల దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. కోళ్ల ఫారాల్లో వందలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయని, కోడిగుడ్ల దిగుబడి కూడా విపరీతంగా తగ్గిందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ కూలీలు 11గంటల లోపే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. చిరువ్యాపారులు వ్యాపారాలు లేక విలవిల్లాడుతున్నారు.



ఎండ వేడిమికి నిర్మానుష్యంగా మారిన సమిశ్రగూడెం -నిడదవోలు బ్రిడ్జి



నల్లజర్లలో సాయంత్రం 4గంటలకు నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు



జన సంచారం లేక ఖాళీగా ఉన్న పెరవలి జాతీయ రహదారి



రాజమహేంద్రవరంలో నిర్మానుష్యంగా ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు



కొవ్వూరులో నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్ సెంటర్

పంటల దిగుబడిలో విత్తన నాణ్యత కీలకం

- కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ నాయుడు
- కౌలు రైతులు కూడా విత్తనోత్పత్తి చేయొచ్చు
- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు

రాజానగరం, మే 31: పంటల దిగుబడిలో విత్తనం నాణ్యత కీలక భూమిక పోషిస్తుందని, విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు సూచించారు. ఎన్ఎస్‌సీఎల్(గుంటూరు ప్రాంతీయ కార్యాలయం), కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ, మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం భాగస్వామ్యంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఇతర రైతులకు నాణ్యమైన విత్తనోత్పత్తి, నాణ్యత ప్రమాణాలు తదితర అంశాలపై కేవీకేలో శుక్రవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తొలుత నాయుడు మాట్లాడుతూ రైతులు కూడా విత్తన ఉత్పత్తిలో పరిశోధన స్థానాలు, విత్తనాభివృద్ధి సంస్థల్లో భాగస్వాములు కావచ్చని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ కౌలు రైతులు కూడా హక్కుదారు రైతులు మాదిరిగానే తమ కౌలు భూముల్లో విత్తన ఉత్పత్తి చేపట్టవచ్చని, విత్తన నాణ్యత ప్రమాణాల పరీక్ష(సీడ్ సర్టిఫికేషన్) ఆవశ్యకతను వివరించారు. రైతులు తమ కమతాల్లో చేపట్టడం ద్వారా ఆదాయం పెంచుకోవడంతో పాటు సాటి రైతుకు నాణ్యమైన విత్తనాల లభ్యతలో తోడ్పాడాలంటూ ప్రోత్సహించారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డయల్ ప్రసాద్‌బాబు పరిశోధనా స్థానంలో లభ్యమయ్యే వరి వంగడాలను వివరించారు. మృత్తిక విభాగం శాస్త్రవేత్త శ్రీనివాస్ నాణ్యమైన విత్తనోత్పత్తి పంటలో భూసారం, ఎరువుల యాజమాన్యం గురించి, కోరుకొండ సహాయ వ్యవసాయ సంచాలకుడు మల్లికార్జునరావు రైతు ఉత్పత్తుల సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ పథకాలను వివరించారు. ఎన్ఎస్‌సీఎల్ ఏరియా మేనేజర్ జగదీష్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ సీడ్ లైసెన్సింగ్ విధానం ద్వారా రైతులను విత్తనోత్పత్తికి ప్రోత్సహిస్తూ రైతులు పండించిన విత్తనాలను ఎన్ఎస్సీ కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు బి.నాగేశ్వరరెడ్డి, టి.విజయవర్ధన్, జె.ప్రభాత్‌నాయుడు, సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన 60 మంది రైతులు పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపునకు రూట్ మ్యాప్ సిద్ధం

- గుర్తింపు కార్డులుంటేనే లోపలికి అనుమతి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత
- నన్నయ వర్శిటీలో లెక్కింపు కేంద్రాలు , స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

దివాన్‌చెరువు, మే 31: లెక్కింపు కేంద్రాల వద్దకు ఈవీఎంలు తీసుకురావడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, కె.మాధవీలత తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని లెక్కింపు కేంద్రాలను, స్ట్రాంగ్‌రూమ్‌లను జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్‌కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్‌లతో కలసి శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం ఓట్లు లెక్కింపు కోసం అసెంబ్లీ సిగ్మెంట్ (పార్లమెంటు) కోసం 98 టేబుళ్ల 116 రౌండ్లు, అసెంబ్లీ నియోజకవర్గాల కోసం 98 టేబుళ్లు, 116 రౌండ్లు మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ఈటీసీబీఎస్, పోస్టల్‌బ్యాలెట్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసామన్నారు. ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్వైజర్, సహాయకులు లెక్కింపు ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తారని తెలిపారు. తగిన గుర్తింపు కార్డులు లేని వారిని నన్నయ విశ్వవిద్యాలయంలోకి అనుమతించబోమన్నారు. ఆ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల తరపున జూన్ 4న ప్రతిపాదించే లెక్కింపు ఏజెంట్ల వివరాలు ఇవ్వాలని ఇప్పటికే తెలియజేశామన్నారు. వారికి సంబంధిత ఆర్వో ద్వారా గుర్తింపు కార్డులు, అధికారిక లేఖలు, వారి సంతకాలు నిర్ధారణ చేయనున్నామని కలెక్టర్ చెప్పారు. రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించే వారి గుర్తింపు నిర్ధారణ చేసుకున్న తరువాత మాత్రమే అనుమతించాలని భద్రత సిబ్బందికి తగిన సూచనలు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌నుంచి లెక్కింపు హాల్ వరకూ వచ్చే మార్గంలో సీసీ కెమెరాలను ఎస్పీ పరిశీలించారు. ఈ మార్గంలో మెష్‌లు ఏర్పాటు చేసి అత్యంత జాగ్రత్తగా తీసుకువచ్చిన ఈవీఎంలు తిరిగి స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరుస్తారని చెప్పారు. ఈవీఎంలు తీసుకువచ్చే వారికి నియోజకవర్గాల వారీగా డ్రెస్‌కలర్ కోడ్ ఇస్తూ అసెంబ్లీ, పార్లమెంటు వివరాలు ముద్రించనున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి మాదవీలత తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.వెంచురెడ్డి, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజ్‌తో ఇబ్బందులు

- దేవరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్థుల ఆందోళన



సబ్‌స్టేషన్ వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న స్థానికులు, టీడీపీ నాయకులు

దేవరపల్లి, మే 31: విద్యుత్ లోఓల్టేజ్, ట్రాన్స్‌ఫార్మర్ పెలిపోవడంతో రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, టీడీపీ నాయకులు దేవరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రాస్తారోకో, ఆందోళన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు సుంకర దుర్గారావు, గన్నమని హరికృష్ణ, స్థానికులు సబ్‌స్టేషన్ వద్ద మాట్లాడుతూ రెండు రోజులు లోఓల్టేజ్ వల్ల విద్యుత్ సరఫరా సరిగ్గా రాకపోవడం, ఫ్యాన్ కూడా తిరగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గురువారం అర్ధరాత్రి నుంచి స్థానిక మెరక వీధి, బీసీ కాలనీలో, చంద్రబాబునాయుడు కాలనీ, నిమ్మలకోట దిబ్బ వీధిలోనూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోవడంతో విద్యుత్ సరఫరాలేక తెల్లవార్లు తీవ్ర ఇబ్బందులుపడారని తీవ్ర ఎండలు, ఉక్కబోత, దోమలతో నిద్రలు లేని రాత్రులు గడిపామని స్థానికులు అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్య వివరించి లైన్‌మ్యాన్‌లకు ఎన్నిసార్లు సమస్య తీసుకొచ్చినా పరిష్కరించడం లేదని విద్యుత్ వినియోగం సరిపడ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చకపోవడంతో ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయని ఏఈ కృష్ణారావు దృష్టికి తీసుకొచ్చామన్నారు. ఎన్నిసార్లు చెప్పిన నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు. ఏడీ ఇక్కడకు వచ్చి సమస్య పరిష్కరిస్తే కానీ ఆందోళన విరమించబోమని స్థానికులు, టీడీపీ నాయకులు గంటసేపు ఆందోళన చేయడంతో ఏడీ శివశంకరరావు హుటాహుటిన వచ్చి స్థానికులతో మాట్లాడారు. సమస్య ఉన్న మెరక వీధి బీసీ కాలనీ, చంద్రబాబు నాయుడు తదితర ప్రాంతాలను పరిశీలించారు. బీసీ కాలనీలో ఉన్న 63కేవీ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చి 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. సమస్య ఉన్న చోట వెంటనే పరిష్కరిస్తామని గ్రామస్థులకు, నాయకులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. యుద్ధ ప్రతిపాదికన లోఓల్టేజ్ సమస్యను, ట్రాన్స్‌ఫార్మర్ మార్చి, కండన్సర్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, చింతపల్లి నాగమణి, కరుటూరి శ్రీనివాస్, బాలాజీ, జనసేన నాయకులు బాలు, మణికంఠ, మహిళలు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ ఏడీ శివశంకర్, ఏఈ కృష్ణారావులను నిలదీస్తున్న స్థానికులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

గత నెల 27న తమిళనాడు వెళ్తుండగా ప్రమాదం

కొవ్వూరు, మే 31: కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. తమిళనాడు రాష్ట్రంలోని దిండుగల్ జిల్లా కుట్టకం గ్రామానికి చెందిన స్వామినాదన్ 30ఏళ్లుగా వ్యాపార నిమిత్తం కొవ్వూరులోనే జీవిస్తున్నారు. పిల్లలిద్దరూ తమిళనాడులో చదువుకుంటున్నారు. వేసవి సెలవులకు కొవ్వూరు వచ్చారు. సెలవులు పూర్తికావడం, అన్న కుమారుడు గోపి పెళ్లిచూపుల నిమిత్తం ఈ నెల 27వ తేదీన ఉదయం స్వామినాధన్, భార్య పిల్లలు, గోపిలతో కలిసి కారులో తమిళనాడు బయలుదేరారు. మార్గమధ్యలో కోడూరుపాడులో కారు అదుపుతప్పి లారీని డీకొట్టిన ప్రమాదంలో స్వామినాధన్, పిల్లలు, గోపి అక్కడికక్కడే మృతి చెందగా భార్య సత్య తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్టు బంధువులు తెలిపారు.

కొడవలితో దాడి.. ఇద్దరిపై కేసు

కొవ్వూరు, మే 31: కొడవలితో వ్యక్తిని గాయపర్చిన సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. రాజమహేంద్రవరం నారాయణపురం వాంబే కాలనీకి చెందిన సీరం మహేష్‌కుమార్ బేరి మోహిత్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొవ్వూరు మండలం నందమూరులో అప్పారావుకు చెందిన పొలం వద్ద పని నిమిత్తం మే 31న వచ్చారు. ఇంతలో రాయుడు త్రినాథ్, అతని పాలేరు పాల నాగేంద్ర బైక్‌పై వచ్చి గారపాటి కుసుడు పొలం వద్ద ఉన్న సీసీ కెమెరాలను నిచ్చెన వేసుకుని తీసివేస్తున్నారు. ఆ విషయాన్ని కుసుడుకి సమాచారం అందించారు. త్రినాథ్, నాగేంద్రలను ఆ పొలం గొడవల్లో ఉంది కదా, కెమెరాలు తీసివేస్తున్నారే అని మోహిత్ అడిగాడు. నీకెందుకురా అంటూ త్రినాథ్ బండిపై ఉన్న కొడవలితో మోహిత్‌ను కొట్టబోతుండగా మహేష్‌కుమార్ అడ్డుగా వెళ్లాడు. ఈ ప్రమాదంలో కుడి చెయ్యి దండపై గాయమయ్యింది. గాయపడిన మహేష్‌కుమార్‌ను యజమాని మోహిత్ చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం, మహేష్‌కుమార్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుదాకర్ తెలిపారు.

ఖాతాలో సొమ్ము అపహరించిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, మే 31: మహిళను మోసగించి బ్యాంకు ఖాతాలో సొమ్ము అపహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జుబేర్ మహ్మద్ తెలిపారు. కొవ్వూరుకు చెందిన ఏఎల్ మధులత శుక్రవారం ఉదయం డబ్బులు తీసుకోవడానికి కొవ్వూరు మెయిన్‌బ్రాంచ్ ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వెళ్లింది. గుర్తుతెలియని వ్యక్తి ఆమెను వెంబడించి ఏటీఎం కార్డు తీసుకుని వేరొక ఏటీఎం కార్డు ఇచ్చి మధులత బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.1,05,000 దొంగిలించినట్టు పట్టణ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసునమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ తెలిపారు.

ఆటో ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

కొవ్వూరు, మే 31: ఆటో ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు గాయాలైనట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామానికి చెందిన మల్లిపూడి నరేష్ భార్యతో కలిసి శుక్రవారం ఉదయం బైక్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు కం రైలు బ్రిడ్జి మధ్యలో వెనుకనుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడి గాయాలయ్యాయి. 108లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, అత్యవసర వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. నరేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

దేవరపల్లి సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, మే 31: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు ఆదేశించారు. దేవరపల్లిలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ ఏఈ ధర్మారావు ఇళ్ల స్థలాలు మండలంలో 2944 మంజూరయ్యాయని, పూర్తయినవి 198 అని తెలిపారు. కాలనీల్లో తాగునీటి బోర్లు వేసినప్పటికి విద్యుత్ కనెక్షన్లు లేకపోవడంతో నిర్మాణాలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. విద్యుత్ శాఖ ఏఈ కృష్ణారావు మాట్లాడుతూ దేవరపల్లి విద్యుత్‌స్టేషన్ పరిధిలో ఉన్న కాలనీల్లో మీటర్లు బిగించిన అన్ని ఇళ్ళకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు దేవరపల్లి విద్యుత్‌స్టేషన్ పరిధిలో చాలాచోట్ల లోఓల్టేజ్ సమస్య ఉందని దాన్ని పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ స్పందిస్తూ లోఓల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ఏఈని ఆదేశించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాలరామకృష్ణంరాజు పదవీ విరమణ సందర్భంగా ఆయనను ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జడ్పీటీసీ స్వర్ణలత, వైస్ ఎంపీపీలు కే.అరుణ, ఎస్.సుబ్బారావు, తహసీల్దార్ ఆచారి, ఎంపీడీవో బాలరామకృష్ణంరాజు, ఈఓపీఆర్‌డీ ప్రభాకరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖాధికారులు పాల్గొన్నారు.

జీఎస్ఎల్‌లో నెల రోజులు ఉచిత వైద్య సేవలు

రాజానగరం, మే 31: నేటి నుంచి జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రిలో నెల రోజులు పాటు(జూన్1 నుంచి జూలై 1)వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని బాస్కరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రారంభించి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా కృతజ్ఞతా పూర్వకంగా నెల రోజుల పాటు అన్ని రకాల ట్రీట్మెంట్లు, మెడికల్ ప్రొసీజర్లు, సర్జరీలు ఉచితంగా చేస్తామని, నెల రోజులు మెడికల్ టెస్టులు, ఇన్వెస్టిగేషన్ల ఫీజుల్లో 50శాతం తగ్గిస్తామన్నారు. మందులు మాత్రం పేషెంట్లే కొనుగోలు చేసుకోవాలన్నారు. తమ సంస్థలైన రాజానగరం జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రి, రాజమహేంద్రవరంలోని స్వతంత్ర ఆసుపత్రి, కేన్సర్ ఆసుపత్రిలో ఉచిత ట్రీట్మెంటు, డిస్కౌంట్‌పై వైద్య సేవలు అందజేస్తామన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నవారికి యథావిధిగా ఉచిత వైద్యం అందుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని డాక్టర్ గన్ని భాస్కరరావు పేర్కొన్నారు.